జాతీయ తెలుగు దినపత్రిక

NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ | సోమవారం 31 ఆగస్టు 2026 | సంపుటి : 16 | సంచిక : 211 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967



## బాబోయ్..... కుక్కలు

### నిజామాబాద్ నగరంలో కుక్కల స్వైర విహారం

### ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుంటున్న ప్రజలు

### చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

**నిజామాబాద్ ప్రతినిధి, ప్రజాజోతి ఆగస్టు 30 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్లో వందలాది కుక్కలు సైర విహారం చేస్తున్నాయి. కుక్కలను చూస్తేనే ప్రజలు జంకుతున్నారు. ఏ డివిజన్ వెళ్లిన గుంపులు గుంపులుగా కుక్కలు ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో కుక్కలు చిన్నపిల్లలను కరచిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని, అలాగే స్కూల్ పిల్లల్ని, కాలనీ వాసుల్ని కుక్కలు కరవడంతో హాస్పటల్ వైపు పరిగెత్తిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అంతేకాకుండా నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దావాఖానలో కుక్క కాటుకు గురైన కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కొన్ని కాలనీలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చిన వాళ్లపై ఎగబడుతున్నాయని మున్సిపల్ అధికారు లకు ఫిర్యాదులు చేసిన ఇప్పటివరకు ఎవరు పట్టించుకోకపోవడం విడ్డూ రం.?వారిని కరిస్తే తప్ప కుక్కలను పట్టుకపోతారేమోనని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ డివిజన్ వెళ్లిన కుక్కల భయంతో నగర ప్రజలు భయపడుతుంటే మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. - మిగతా 2లో



## బుగ్గరామేశ్వర ఆలయంలో చోరీ



**గాంధారి, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి )**

గాంధారి మండలం పెద్దపోతంగల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్న ప్రాచీన బుగ్గరామేశ్వర ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి స్వామి విశ్వనాథన్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7.30 గంటలకు పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ తలుపులకు తాళం వేసి పక్క గదిలో నిద్రించారు.ఆదివారం తెల్లవారుజామున 6 గంటలకు ఆలయం తలుపులు తెరిచేందుకు వెళ్లగా.. తలుపులకు వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఆలయంలోని రెండు హుండీల్లో ఉన్న నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించినట్లు తెలిపారు. సుమారు రూ.8 వేల వరకు నగదు చోరీకి గురైనట్లు పూజారి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.పూజారి స్వామి విశ్వనాథన్ ఫిర్యాదు మేరకు గాంధారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు ప్రజా వాణి కార్యక్రమం



### ప్రతి సోమవారం ప్రజావాణి.. సమస్యల పరిష్కారానికి వేదిక

### మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

### ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహణ

### ఎంపీడీవో హెప్సీబా రాణి

వివరాలు 2లో

## మత్తమాలలో ఘనంగా ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విగ్రహ దాత, జపాన్ శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పైడి ఎల్లారెడ్డిని గ్రామస్తులతో కలిసి విగ్రహ ఆవిష్కరణ చేశారు. అంతకు ముందు పైడి ఎల్లారెడ్డిని గ్రామస్తులు బైక్ ర్యాలీగా గ్రామం వరకు ఘన స్వాగతం పలికారు.






## యూరియా దొరకక పొలాన్ని వదిలేస్తున్న రైతు!

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు. గంగారెడ్డి

### 'ఎవరైనా నా పొలం చేసుకోండి.. ఒక్క సంచి యూరియా కూడా దొరకడం లేదు" - గంగారెడ్డి ఆవేదన

**ఇందల్వాయి. ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 30**

ఇందల్వాయి: యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధర్పల్లి మండల కేంద్రంలోని రామడుగు గ్రామానికి చెందిన రైతు గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు అవసరమైన యూరియా కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా ఒక్క సంచి కూడా దొరకడం లేదని, దీంతో తాను సాగు చేసిన పొలాన్ని వదిలివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన వాపోయారు. "యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా ఒక్క సంచి కూడా దొరకడం లేదు. ఆన్లైన్‌లో - మిగతా 2లో

## బాబోయ్.... కుక్కలు

-మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 19 వేల కుక్కలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. అయితే ఈ కుక్కలకు ఆంటీ రేబిస్ టీకా ఇవ్వడం ద్వారా కుక్క కరిచిన ఏమీ కాదని అధికారులు తెలుపుతున్నారు. ఈ టీకాను మున్సిపల్ అధికారులకు ఇవ్వడం జరుగుతుందని, వారు పట్టుకునే టీం ద్వారా ఈ టీకాను వేయిస్తారని తెలిపారు. మున్సిపల్ అధికారులు మాత్రం ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో కుక్కలు అధికారికంగా ఉండగా మరో ఐదు వేల పైగా కుక్కలు ఉన్నట్లు సమాచారం. వీటిని నివారించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు. ప్రస్తుతం నగరంలో కుక్కలు సైర విహారం చేస్తున్న పట్టించుకొనే నాధుడే కరవయ్యరాని ప్రజలు ఆందోలన వ్యక్తం చేస్తున్నారు.

## కోటగిరి ఉమ్మడి పోతంగల్ మండలాల విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక.



**కోటగిరి, ఆగస్టు 31, ప్రజా జ్యోతి:** కోటగిరి పోతంగల్ ఉమ్మడి మండలాల విజ్ఞాన్ అసోసియేషన్ సభ్యులందరూ కలిసి నూతన కమిటీని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. విజ్ఞాన్ ప్రెస్ క్లబ్ అసోసియేషన్ నాలుగు సంవత్సరాల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకోబడింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గైని గజానంద్. ఉపాధ్యక్షులుగా, ఎం ఏ సమీర్. కోశాధికారిగా ,గైని శంకర్. ప్రధాన కార్యదర్శిగా, వడ్డే నర్సింలు. సహాయ కార్యదర్శిగా, సింహాద్రి. గౌరవ అధ్యక్షులుగా, ఎన్ శ్రీనివాసరావు. ఈ సందర్భంగా గైని గజానందు అధ్యక్షుడు మాట్లాడుతూ విజ్ఞాన్ ప్రెస్ క్లబ్ అసోసియేషన్ తరపునుండి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇకనుండి అసోసియేషన్కు కట్టుబడి ఉంటూ అభివృద్ధి పాటు పడతానని ఆయన వివరించారు అసోసియేన్ కొరకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అందరి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన్ ప్రెస్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిర్నాపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ కళ్యాణ మండపానికి రూ.5 లక్షల నిధులు





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 30** ఇందల్వాయి: మండల కేంద్రంలోని సిర్నాపల్లి గ్రామంలో కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయానికి కళ్యాణ మండపం నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి రూ.5 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను అందజేశారు. గుండ్ల రవి ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎల్ఐసీ గంగాధర్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే డాక్టఎర్ భూపతి రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కే భూమయ్య. కార్యదర్శి సొప్పరి జగదీష్. ఉపాధ్యక్షులు ఎం రాజు. సిహెచ్ పోచయ్య. ఉప సర్పంచ్ సుదర్శన్. తలారి సాయిలు. బి విజయ్ ఎల్ఐసి గంగాధర్. పాల్గొన్నారు

## వెంకన్న కుటుంబానికి ప్రభుత్వ సలహాదారు సహాయం.

**ఫోటో. ఆర్థిక సహాయం అందజేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి.**



**కోటగిరి ఆగస్టు30 ప్రజా జ్యోతి :** వర్ని మండలంలోని తగిలేపల్లి గ్రామంలో హత్యకు గురైన తగిలేపల్లి మాజీ సర్పంచ్ వెంకన్న కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.ఆదివారం వెంకన్న కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకన్న తో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.పోచారం వెంట జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

## యూరియా దొరకక పొలాన్ని వదిలేస్తున్న రైతు..!

-మొదటిపేజీ తరువాయి

బుక్ చేసుకునేందుకు ప్రయత్నించినా బుకింగ్ కావడం లేదు. పంటకు యూరియా వేయాల్సిన సమయంలో అది అందుబాటులో లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు" అంటూ గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "నేను కాంగ్రెస్ ప్రభుత్వానికే చెందిన వాడిని. అయినా నాకు చిటికెడు యూరియా కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల ఇబ్బందులను పట్టించుకోవాలి" అని ఆయన కోరారు. యూరియా అందక తన పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటూ.. "ఎవరైనా నా పొలాన్ని చేసుకోండి. నాకు యూరియా దొరకడం లేదు" అంటూ గ్రామస్థుల ఎదుట గంగారెడ్డి తన ఆవేదనను వ్యక్తం చేశారు. యూరియా కొరతను వెంటనే పరిష్కరించి రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఆన్లైన్ బుకింగ్ సమస్యలను పరిష్కరించాలని గంగారెడ్డి ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

## బీడీ కార్మికులకు మోసం చేస్తే కేసీఆర్‌కు పట్టిన గతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పడుతుంది...



**ప్రజా జ్యోతి బోధన్ ఆగస్టు 30.** ఆగస్టు 15 నుండి రాష్ట్రంలో 2.5 లక్షల కొత్త పెన్షన్లను ఇస్తామని ప్రచారం చేసుకున్న పాలకులు. 15 ఆగస్టు నుండి కొత్తగా ఒక్క పెన్షన్ కూడా మంజూరు చేయకపోగా... దరఖాస్తులను చేసుకొమ్మని చల్లటి కబురును చెప్పారు. కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులో వితంతు ఒంటరి మహిళలు గీతా కార్మికులు చేనేత కార్మికులు ఫైలేరియా డయాలసిస్ అంగవైకల్యం తదితర ఏడు రకాల వారికి మాత్రమే అవకాశం కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానం ప్రకారం పెన్షన్లు రానటువంటి బీడీ కార్మికులకు అప్లై చేసుకోవడానికి దరఖాస్తులు ఆప్షనే లేదు. బి. మల్లేష్, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీ యూ సీ ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు. ఆదివారం నాడు నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలోని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీ యూ సీ ఐ) ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో జరిగిన సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి. మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా కటాఫ్ డేట్ ను తొలగించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజులలోనే జీవన భృతిని 4,016 రూపాయల కాడికి ఇస్తానని, ప్రస్తుతం 2,016 రూపాయలు పొందుతున్న వారికి కూడా పెంచి 4,016 చొప్పున ఇస్తానని వాగ్దానం చేసి మూడు సంవత్సరాలు కావస్తున్న నేటికీ ఇవ్వకుండా బీడీ కార్మికులకు మోసం చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. అట్లాగే పంద్రాగస్టు నుండి తెలంగాణలో కొత్తగా 2 లక్షల 50 వేలు పింఛన్లను ఇస్తామని ప్రక్కనలు చేసి ఇప్పుడు దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నామని పింఛన్ల కోసము అప్లై చేసుకోవాలని చెప్పడం జరుగుతుందని అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అప్లికేషన్ ఫారం లో వితంతు, ఒంటరి మహిళలు,గీతా కార్మికులు, చేనేత కార్మికులు,ఫైలేరియా, డయాలసిస్, అంగవైకల్యము తదితర ఏడు రకాల కేటగిరిల వారికి మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారని దానిలో బీడీ కార్మికులకు చేర్చకపోవడం పెద్ద మోసం అని ఈ మోసాన్ని బీడీ కార్మికులు సహించరని గతంలో కూడా కేసీఆర్ ఇదే విధంగా బీడీ కార్మికులకు మోసం చేస్తే అప్పుడు జరిగిన ఎన్నికల్లో ఓడించి ఆయనను ఫామ్ హౌస్ కే పరిమితం చేశారు. రేవంత్ రెడ్డి కూడా బీడీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం అందరికీ 416 రూపాయలు పింఛన్లను ఇవ్వనట్లయితే కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని బి. మల్లేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బీడీ కార్మికులు కళ్యాణి, లక్ష్మి, జ్యోతి, గంగమణి, సునంద,వరలక్ష్మి తదితరులతో పాటు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ బోధన్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొలిపాక రేణుక..



**ప్రజా జ్యోతి బోధన్ ఆగస్టు 30.** బోధన్ పట్టణంలో నూతనంగా ఎన్నికైన బాలరాజు , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రాజులదేవి లక్ష్మీ పూజిత పవన్ కుమార్ , ఫ్లోర్ సెక్రటరీ గుంత అబ్బవ్వ, గంగాధర్ గార్లను ఘనంగా సన్మానించి , మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి బోధన్ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్,మాజీ కౌన్సిలర్ మాసిని వినోద్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి మీర్జాపూర్ అరవింద్, సీనియర్ నాయకులు హన్మండ్లు చారి, పప్పుల వేణు, పెరక వెంకటేష్, దీజేవీ పట్టణ అధ్యక్షుడు ఏనుగంటి గౌతమ్ గౌడ్, పార్టీ నాయకులు కలిగోట కృష్ణ, గడ్డం శ్రీనివాస్, వినయ్, చరణ్, కన్నె శ్రీనివాస్,హరి, అనీల్, రవి కుమార్, కస్ప లింగం తదితరులు పాల్గొన్నారు.లి

## సిరికొండ మండలం నుండి ఏఐయుకెఎస్ జనరల్ కౌన్సిల్‌కు తరలిన నేతలు



**సిరికొండ, ప్రజా జ్యోతి 30** సిరికొండ మండలం కేంద్రం నుండి కమ్మర్ పల్లి మండల కేంద్రం లో జరుగుతున్న ఏఐయుకెఎస్ ఆర్మూర్ డివిజన్ జనరల్ కౌన్సిల్ కు జిల్లా కార్యదర్శి ఆర్ దామోదర్, జిల్లా నాయకులు ఎం నారగౌడ్ ల ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న ఏఐయుకె ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జీ నడ్పి నర్సయ్య సిరికొండ మండల నాయకులు బి కిషోర్, జీ సాయరెడ్డి, ఎం పండరి, ఇస్త్రీ గంగాధర్, జంగల్ రాజు తదితరులు వెళ్లారు, సందర్భంగా ఏఐయుకేఎస్ జిల్లా కార్యదర్శి ఆర్ దామోదర్, జిల్లా నాయకులు ఎం నారగౌడ్లు,మాట్లాడుతు అనేక రైతంగా పోరాటాలు చేపట్టిన అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) గత ఉద్యమాన్ని సమీక్షమించుకొని,భవిష్యత్ ఉద్యమాలను రూపొందించుకొవడం కోసమే డివిజన్ జనరల్ కౌన్సిల్ ను నిర్వహిస్తున్నాం అన్నారు. రైతంగా పోరాటాలే లక్ష్యం గా ఏఐయుకెఎస్ భవిష్యత్ పోరాటాలను చేపట్టడానికి మరింత కర్తవ్యాలను రూపొందించుకొనున్నాం అన్నారు. డివిజన్ జనరల్ కౌన్సిల్ లో ఏఐయుకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి ప్రభాకర్, రైతంగా పోరాటాలు – మన కర్తవ్యం అన్న అంశం పై ప్రసంగిస్తారన్నారు.

## 31న జరిగే పంచ్‌జన్య మహాసభను విజయవంతం చేయాలి: మాజీ జెడ్పీటీసీ నరేష్ నాయక్



**ఇందల్వాయి: ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 30.** ఇందల్వాయి మండలంలోని దేవి తండా, దేవిగాడ్ గ్రామపంచాయతీ పరిధిలో మాజీ జెడ్పీటీసీ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివరాం మహారాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ నరేష్ నాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 31న నిర్వహించనున్న పంచ్‌జన్య మహాసభను విజయవంతం చేయాలని ఇందల్వాయి మండల ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా పేదల వైద్య విద్య తదితర సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గోరుమాటి బాయి అక్కచెల్లెల్లతో పాటు మండలంలోని ప్రతి ఒక్కరూ సభకు హాజరై తమ మద్దతు తెలియజేయాలని నరేష్ నాయక్ విజ్ఞప్తి చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పంచ్‌జన్య మహాసభ వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివరాం మహారాజ్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంజయ్య జ్ఞాపకార్థం బాలికల కబడ్డీ పోటీలు




**ముప్కాల్, ప్రజాజోతి, ఆగస్టు 30** ముప్కాల్ కీ.శే. నునుగొండ అంజయ్య జ్ఞాపకార్థం ముప్కాల్ స్పోర్ట్స్అకాడమీ ఆధ్వర్యంలో అండర్-17 ఒక్కరోజు బాలికల కబడ్డీ పోటీలు శనివారం సాయంత్రం ముప్కాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినుల కబడ్డీ జట్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభాను చాటుకున్నారు.హోరాహోరీగా సాగిన పోటీల్లో పోచంపాడ్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఈ విషయాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్ రెడ్డి తెలిపారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కీ.శే. నునుగొండ అంజయ్య కుమారుడు నునుగొండ రామకృష్ణ హాజరై విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.అనంతరం విజేత జట్టుకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. క్రీడాకారులను నిర్వాహకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం





**గ్రామ ప్రజలకు అరుదైన సేవ ఉగ్రవాయి గ్రామానికి వైకుంఠ రథం విరాళం**

**పందిరి అనసూయ--మల్లారెడ్డి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపిన పందిరి ప్రభాకర్ రెడ్డి**

**అత్యవసర సమయంలో పేద, సామాన్య కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం**

**కామారెడ్డి, టౌన్ ఆగస్టు 30, ప్రజా జ్యోతి** తల్లిదండ్రుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకోవడంతో పాటు గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఉపయోగపడేలా సేవా కార్యక్రమాన్ని చేపట్టారు కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం ఉపాధ్యక్షులు పందిరి ప్రభాకర్ రెడ్డి. తన తల్లిదండ్రులు స్వర్గీయ పందిరి అనసూయ--మల్లారెడ్డి గార్ల జ్ఞాపకార్థం ఉగ్రవాయి గ్రామ ప్రజల సౌకర్యార్థం వైకుంఠ రథాన్ని విరాళంగా అందజేశారు.

గ్రామంలో ఎవరైనా కుటుంబ సభ్యులను కోల్పోయినప్పుడు అంత్యక్రియల సమయంలో అవసరమైన వైకుంఠ రథం కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభాకర్ రెడ్డి ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామానికి ఉపయోగపడే ఒక మంచి కార్యక్రమాన్ని చేయాలనే సంకల్పంతో వైకుంఠ రథాన్ని అందజేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రుల జ్ఞాపకాలకు సేవా రూపం

సాధారణంగా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, అయితే గ్రామ ప్రజలకు అవసరమైన



సమయంలో ఉపయోగపడేలా వైకుంఠ రథాన్ని అందించడం గొప్ప సేవాభావానికి నిదర్శనమని గ్రామస్థులు పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల తనకున్న ప్రేమ, గౌరవాన్ని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమంగా మలచిన పందిరి ప్రభాకర్ రెడ్డిని పలువురు అభినందించారు.

ఈ వైకుంఠ రథం వల్ల ఉగ్రవాయి గ్రామంతో పాటు అవసరమైన సందర్భాల్లో గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయోజనం కలిగే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు అత్యవసర సమయంలో వైకుంఠ రథం అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

గంప శశాంక్ చేతుల మీదుగా అందజేత

ఉగ్రవాయి గ్రామానికి అందజేసిన వైకుంఠ రథాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంప శశాంక్ చేతుల మీదుగా గ్రామానికి అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచే విధంగా వైకుంఠ రథాన్ని అందించడం పట్ల ప్రభాకర్ రెడ్డిని అభినందించారు.

గ్రామస్థుల హర్షం

వైకుంఠ రథం గ్రామానికి అందుబాటులోకి రావడంతో ఉగ్రవాయి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో రవాణా సౌకర్యం కోసం బయట ప్రాంతాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని, గ్రామంలోనే ఈ సౌకర్యం అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

పందిరి ప్రభాకర్ రెడ్డి చేసిన ఈ సేవా కార్యక్రమం తల్లిదండ్రుల జ్ఞాపకాలను గౌరవించడమే కాకుండా, గ్రామ ప్రజల పట్ల ఆయనకున్న బాధ్యతను, సామాజిక సేవా దృక్పథాన్ని చాటిచెప్పేలా ఉందని గ్రామస్థులు అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు.

సేవా కార్యక్రమాలకు ఆదర్శం

ప్రజలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామంలో సేవా స్ఫూర్తిని పెంపొందించవచ్చని పలువురు పేర్కొన్నారు. తల్లిదండ్రుల పేరుతో గ్రామానికి శాశ్వతంగా ఉపయోగపడే వస్తువును అందించడం ద్వారా వారి జ్ఞాపకాలను సజీవంగా ఉంచే ప్రయత్నం చేయడం అభినందనీయమని అన్నారు.

గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వైకుంఠ రథాన్ని అందజేసిన పందిరి ప్రభాకర్ రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా వాణి కార్యక్రమం

**కామారెడ్డి, టౌన్ ఆగస్టు 30, ప్రజా జ్యోతి** కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) హెప్సీబా రాణి తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తమకు ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమం మంచి వేదికగా ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై సంబంధిత వివరాలతో పాటు అవసరమైన పత్రాలు, దరఖాస్తులను తీసుకుని ప్రజావాణికి హాజరై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, పింఛన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలు, ఇళ్ల నిర్మాణం, ఉపాధి హామీ పనులు తదితర సమస్యలు ఉన్నట్లయితే వాటిని ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఎంపీడీవో తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్పష్టంగా పేర్కొంటూ దరఖాస్తులు సమర్పించాలని, సంబంధిత ఆధార పత్రాలు ఉంటే వాటిని కూడా జతచేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో కామారెడ్డి మండల ఎంపీడీవో హెప్సీబా రాణితో పాటు ఎంఆర్ఓ, హేమ బిందు ఎంపీఓ, త్రివేద్ పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, హౌసింగ్, గ్రామీణాభివృద్ధి తదితర వివిధ శాఖలకు చెందిన అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో హెప్సీబా రాణి కోరారు.

## లింగంపేటలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



**ఎల్లారెడ్డి /లింగంపేట ఆగస్టు -30(ప్రజా జ్యోతి )** లింగంపేట మండల కేంద్రంలో తీజ్ పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ వేడుకలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు పాల్గొని వేడుకలను ప్రారంభించి, ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారికి నిర్వాహకులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు ఘన స్వాగతం పలికారు.తీజ్ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే గొప్ప పండుగ అని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. మన పూర్వీకుల నుంచి కొనసాగుతున్న ఆచారాలను కాపాడుకుంటూ, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.పండుగలు కేవలం ఆచారాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరియు ఆత్మీయతను పెంపొందించేందుకు దోహదపడతాయని ఎమ్మెల్యే గారు అన్నారు. లింగంపేట మండల కేంద్రంలో తీజ్ పండుగను ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, వేడుకలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మహిళలు, యువత సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ పాటలు, నృత్యాలు మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి. ప్రజల పెద్దఎత్తున పాల్గొనడంతో తీజ్ పండుగ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ

## సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పెట్టె గొప్ప పండుగ తీజ్

**ఎల్లారెడ్డి తీజ్ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ ఎంపీ బీబీపాటిల్**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి)** గిరిజనుల సాంస్కృతికి అద్దం పెట్టె గొప్ప పండుగ తీజ్ పండుగ అని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల బంజారాల ఆధ్వర్యంలో బస్ డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్ హాజరై గిరిజనులందరికీ తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ.. బంజారాలు భక్తి శ్రద్ధలతో తీజ్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పెళ్లికాని యువతులు గోధుమలను చిన్న బుడ్డిలో నానబెట్టి మొలకలు వచ్చేలా చేసి, తొమ్మిది రోజుల పాటు తాము కోరుకున్న కోరికలు నెరవేరాలని కులదైవాన్ని పూజిస్తారని తెలిపారు. తొమ్మిది రోజులు పవిత్రంగా పూజలు నిర్వహించి శ్రావణ మాసంలో గిరిజన మహిళలంతా కలిసి ఘనంగా జరుపుకునే ఈ తీజ్ పండుగ గిరిజన సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. అనంతరం మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. తీజ్ పండుగ గిరిజనుల సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. వ్యవసాయాన్ని స్త్రీత్వాన్ని గౌరవించే గొప్ప పండుగ తీజ్ అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ గిరిజనులతో కలిసి నృత్యం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సురేందర్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల అధ్యక్షులు రాములు నాయక్, రమేష్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వివిధ తాండల నాయకులు, గిరిజన మహిళలు, యువతి, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి జప్తు నోటీసుతో కూలీ కుటుంబంలో విషాదం

**బస్వాయిపల్లిలో ఆర్థిక ఇబ్బందులతో యువకుడి మృతి**



**నసురుల్లాబాద్, ప్రజాజ్యోతి ఆగస్టు 30:** ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న హౌసింగ్ రుణం కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన విషాద ఘటన నసురుల్లాబాద్ మండలం బస్వాయిపల్లిలో చోటుచేసుకుంది. రుణ వాయిదాలు చెల్లించలేని పరిస్థితుల్లో ఇంటి జప్తుకు సంబంధించి రుణ సంస్థ నుంచి నోటీసులు రావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిసింది. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబం సొంతింటి కోసం రుణం తీసుకున్నట్లు సమాచారం. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో రుణ వాయిదాల చెల్లింపులో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలో జప్తు నోటీసులు రావడంతో కుటుంబంపై ఒత్తిడి మరింత పెరిగినట్లు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా కుటుంబానికి చెందిన ఓ యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. యువకుడి మృతికి గల పూర్తి కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కూలీ కుటుంబాల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రుణ వసూళ్లలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

## భక్తుల మహా పాదయాత్ర



**జుక్కల్, ప్రజాజ్యోతి ఆగస్టు 30:** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని జుక్కల్ మండలంలోని లాడేగావ్ గ్రామంలో భక్తుల మహా పాదయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణమాసం మూడో ఆదివారం నిర్వహించే ఈ పాదయాత్రలో భాగంగా ఆదివారం ఉదయం లాడేగావ్ నుంచి పిట్లం మండలంలోని చిన్న కొడంగల్ గ్రామ సమీపంలోని ప్రసిద్ధ రామలింగేశ్వర గుట్ట వరకు వందలాది మంది భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. కీర్తిశేషులు మారుతి మహారాజ్ ప్రారంభించిన ఈ పాదయాత్రను నందు మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లాడేగావ్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భజన బృందాలు, భజంత్రీలతో పాదయాత్ర ప్రారంభమైంది. మార్గమంతా 'విట్టల.. విట్టల.. పాండురంగ' నామస్మరణలు, కీర్తనలతో భక్తులు ఉత్సాహంగా సాగారు. పాదయాత్రలో గ్రామ పెద్దలు రాజశేఖర్ పటేల్, నందు మహారాజ్, సంజు మహారాజ్, శివాజీ పటేల్, అంతేశ్వర్ గురూజీ, బాబురావు పటేల్, కంటాలి సంతోష్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు. బేగంపూర్‌కు చెందిన బచ్చల ఆంజనేయులు భక్తులు, భజన బృందాల సభ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గంగారామరాజు వాసర్కర్, సంఘయ్య మహారాజ్ ఆధ్వర్యంలో రాత్రి కీర్తనలు నిర్వహించారు. పాదయాత్రలో వందలాది మంది మహిళలు, భక్తులు పాల్గొనగా, జుక్కల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన భజన మండళ్లు తమ సేవలను అందించాయి. దీంతో లాడేగావ్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## నేడు పెన్షన్ దరఖాస్తుల చివరి అవకాశం

**--ఫైలేరియా బాధితులకు డాక్టర్ సూచన**



**సదాశివనగర్, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి)** ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న అర్హులైన లబ్ధిదారులు ఫైలేరియాతో బాధపడుతున్న అర్హులైన లబ్ధిదారులకు నేడు అనగా 31 ఆగస్టు చివరి అవకాశమని సదాశివనగర్ మండల వైద్యాధికారి డాక్టర్ అస్మ ఆఫ్షన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు నేటితో దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తుంది కావున దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

**దరఖాస్తుకు అవసరమైన పత్రాలు:-** చేయూత దరఖాస్తు ఫారం వైద్య ధ్రువీకరణ పత్రం ఆధార్ కార్డ్ బ్యాంక్ పాస్ బుక్ రేషన్ కార్డు జిరాక్స్ తో సమర్పించాలన్నారు. వివిధ రకాల పెన్షన్ పొందుతున్న వారు ఫైలేరియా పెన్షన్ కు అర్హులు కారన్నారు. అర్హులైన లబ్ధిదారులు నేడు అనగా మంగళవారం నాటికి దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తుందన్నారు

## పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన మాజీ జెడ్పీటీసి

**--పడిగేల రాజేశ్వరరావు**




**సదాశివనగర్, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు పదవి విరమణ మహోత్సవానికి సదాశివనగర్ మండల మాజీ జెడ్పీటిసి హాజరయ్యారు. మాజీ జెడ్పీటిసి రాజేశ్వరరావు మాట్లాడుతూ గురువు లేని విద్య గుడ్డి విద్య గురువులు చెప్పిన విధంగానే విద్యార్థులు దేశ భవిష్యత్తుకు తయారవుతారని విద్యార్థులను మంచి విద్యార్థులుగా తీర్చిదిద్ది అవకాశం టీచర్ మృతికి సాధ్యమవుతుందని ఎందరినో విద్యావంతులను డాక్టర్లను ఉపాధ్యాయులను వివిధ శాఖల లో స్థిరపడి సేవలందించే విధంగా విద్యాబుద్ధులు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న రామారెడ్డి మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాంధారి మాజీ ఎంపీపీ శివాజీ రావు. రాష్ట్ర ఉద్యోగ సంఘం జనరల్ సెక్రటరీ సుధాకర్ రావు. విద్యాశాఖ అధికారి ఆనందరావు ను ఘనంగా సన్మానించారు. ఆనంద్ రావు ఉపాధ్యాయునిగా యూనియన్ నాయకునిగా సమాజానికి చేసిన సేవలను కొని ఆడారు. ఈ కార్యక్రమంలో జస్వంత్ రావు. ప్రభాకర్ రావు. అంబీర్ గంగాధర్. రావు వాడికారి గంగాధర్ రావు. సుధాకర్ రావు. కాట్మండే ప్రభాకర్ రావు. సంఘ సభ్యులు తదితరులు.

## ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు తెస్తున్న

# పాఠశాల ఉపాధ్యాయురాలు రంజిత

**20 నెలల్లోనే విద్యార్థులలో మార్పు పాఠశాల ప్రతిష్ఠను పెంచుతున్న ఉపాధ్యాయురాలు రంజిత**

**సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఇస్రోజీవాడి పాఠశాల**

**నవోదయ ప్రవేశాలే లక్ష్యంగా ప్రత్యేక బోధన**

**వెనుకబడిన విద్యార్థుల కోసం గ్రూపులుగా విభజించి ప్రత్యేక శిక్షణ**

**చదువుతో పాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులకు ప్రోత్సాహం**

**విద్యార్థుల కోసం సొంత ఖర్చులతో సామగ్రి అందిస్తున్న రంజిత**



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 30 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ బాధ్యతను కేవలం తరగతి గదిలో పాఠాలు చెప్పడంతో ముగించకుండా, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఇస్రోజీవాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రంజిత నిరూపిస్తున్నారు. ఇస్రోజీవాడి గ్రామానికి వచ్చి సుమారు 20 నెలలు మాత్రమే అవుతున్నప్పటికీ, ఈ స్వల్ప కాలంలోనే విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు పాఠశాలకు జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, సైన్స్‌ఫెయిర్ పై ఆసక్తి కల్పించడం, నవోదయ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం పొందేలా విద్యార్థులను సిద్ధం చేయడం, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం వంటి అనేక కార్యక్రమాలను రంజిత చేపడుతున్నారు.

**20 నెలల్లోనే పాఠశాలలో కొత్త ఉత్సాహం**

ఇస్రోజీవాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు రంజిత విధుల్లో చేరినప్పటి నుంచి విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంచేందుకు అనేక విధాలుగా కృషి చేస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రతి విద్యార్థి చదువులో ముందుండాలని, ఎవరు వెనుకబడకుండా అందరూ కనీస విద్యా ప్రమాణాలను సాధించాలని ఆమె ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించడంతో పాటు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారికి అర్థమయ్యే విధంగా విషయాలను వివరించడం ద్వారా చదువుపై ఆసక్తిని పెంచుతున్నారు. విద్యార్థుల స్థాయిని గుర్తించి వారికనుగుణంగా బోధన అందిస్తున్నారు.

**సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం**

ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయురాలు రంజిత తీసుకువచ్చిన ముఖ్యమైన గుర్తింపుల్లో సైన్స్ ఫెయిర్ విజయం ఒకటి. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కల్పిస్తూ, వారి ఆలోచనా శక్తిని పెంపొందించే విధంగా ప్రాజెక్టులు, ప్రయోగాలు, నమూనాలపై అవగాహన కల్పించారు.

జిల్లాస్థాయిలోనే కాకుండా విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేలా ప్రత్యేకంగా ప్రోత్సహించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ, వాటిని ఎలా వివరించాలి, ఎలా ప్రదర్శించాలి అనే అంశాలపై కూడా శిక్షణ ఇచ్చారు.

దీంతో ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించడం విశేషంగా నిలిచింది. ఒక గ్రామీణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రాష్ట్రస్థాయి వేదికపై రెండో స్థానం సాధించడం వెనుక రంజిత కృషి ఎంతో ఉందని తల్లిదండ్రులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు.

**నవోదయలో సీటు సాధించడమే లక్ష్యం**

ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలను నిర్దేశిస్తూ రంజిత బోధన కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, అందులో సీటు సాధించేలా వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

విద్యార్థులలో ఎవరి సామర్థ్యం ఎంత ఉందో గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రశ్నలను అర్థం చేసుకోవడం, సమాధానాలను రాయడం, చదవడంలో వేగం పెంచడం, ప్రాథమిక అంశాలపై పట్టు సాధించడం వంటి విషయాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కూడా నవోదయ వంటి మంచి విద్యాసంస్థల్లో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆమె చేస్తున్న కృషిని తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

**వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళిక**

విద్యార్థులందరూ ఒకే స్థాయిలో ఉండరని గుర్తించిన రంజిత , చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి అదనపు శిక్షణ ఇస్తున్నారు.

మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సమయం గడపకుండా, ఆ సమయాన్ని కూడా విద్యా కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. ఐదుగురు, ఆరుగురు విద్యార్థులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి, వారి సామర్థ్యాన్ని బట్టి చదివించడం, రాయించడం చేస్తున్నారు.

ఒక గ్రూపులో చదువులో కొంత మెరుగైన విద్యార్థులను, మరో గ్రూపులో వెనుకబడిన విద్యార్థులను ఏర్పాటు చేసి వారికి అవసరమైన విధంగా బోధిస్తున్నారు. ముఖ్యంగా చదవడం, రాయడం రాని లేదా నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులపై అదనపు శ్రద్ధ చూపుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులను ఇతర విద్యార్థుల స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు రంజిత చెబుతున్నారు. దీంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు తమపై తమకు నమ్మకం కూడా పెరుగుతోందని తల్లిదండ్రులు అంటున్నారు.

**చదువు మాత్రమే కాదు.. ఆటలు, పాటలు కూడా**

పిల్లల సమగ్ర అభివృద్ధికి చదువుతో పాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని భావిస్తూ రంజిత పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల్లో ఉన్న కళా ప్రతిభను గుర్తించి వారికి వేదిక కల్పిస్తున్నారు. పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలు తదితర కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో చదువుతో పాటు ఇతర రంగాల్లో కూడా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం పొందుతున్నారు.

పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూపొందించేందుకు ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

**విద్యార్థుల కోసం సొంత ఖర్చులతో సామగ్రి పాఠశాల ఉపాధ్యాయురాలు**

రంజిత చేస్తున్న సేవల్లో మరో ప్రత్యేకత విద్యార్థుల కోసం అవసరమైన వస్తువులను కొన్ని కార్యక్రమాల్లో తన సొంత ఖర్చులతో సమకూర్చడం అని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పాఠశాలలో ఏదైనా కార్యక్రమం నిర్వహించినప్పుడు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనేలా వారికి అవసరమైన సామగ్రిని సమకూర్చడంతో పాటు, విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేలా ప్రోత్సహిస్తున్నారు.

విద్యార్థుల కోసం వ్యక్తిగతంగా సమయం కేటాయించడంతో పాటు కార్యక్రమాల విజయానికి తన వంతు సహకారం అందిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

**రాజయ్య మాస్టర్ సేవలను గుర్తు చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయురాలు రంజిత**

ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలలో గతంలో రాజయ్య అనే ఉపాధ్యాయుడు విద్యార్థులకు మంచి విద్యాబోధన అందిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. ఆయన సేవలను ఇప్పటికీ గ్రామస్తులు, తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటున్నారు.

ప్రస్తుతం రాజయ్య మాస్టర్ లేని లోటును పాఠశాల ఉపాధ్యాయురాలు రంజిత తన కృషితో కొంతవరకు భర్తీ చేస్తున్నారని వారు అభిప్రాయపడుతున్నారు. పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమె చేస్తున్న కృషి, పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యం అభినందనీయమని చెబుతున్నారు.

**ప్రతి విద్యార్థిపై ప్రత్యేక నిఘా**

రంజిత బోధనలో ముఖ్యమైన అంశం ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టడం. ఎవరు ఏ విషయంలో వెనుకబడి ఉన్నారు? ఎవరు ఏ విషయంలో ప్రతిభ చూపుతున్నారు? అనే అంశాలను గుర్తిస్తూ వారికి అనుగుణంగా శిక్షణ అందిస్తున్నారు.

ఒక విద్యార్థి చదువులో వెనుకబడితే అతడిని నిరుత్సాహపరచకుండా మరింత శ్రద్ధతో బోధించడం, చిన్న విజయాన్ని కూడా అభినందించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నారు.

"వెనుకబడిన విద్యార్థి కూడా ముందుకు రావాలి.. ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో తన ప్రతిభను చూపాలి" అనే ఉద్దేశంతో ఆమె బోధన కొనసాగిస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**గ్రామ పాఠశాలకు రాష్ట్రస్థాయి పేరు తీసుకురావడమే లక్ష్యం**

ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలను రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొందే పాఠశాలగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు రంజిత చెబుతున్నారు. ఇప్పటికే సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం ప్రారంభ విజయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు విద్యార్థులను సిద్ధం చేస్తానని పేర్కొంటున్నారు.

ప్రతి విద్యార్థి పాఠశాల నుంచి మంచి విద్యను నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షిస్తున్నారు.

**తల్లిదండ్రుల నుంచి అభినందనలు పాఠశాల ఉపాధ్యాయురాలు**

రంజిత చేస్తున్న కృషిపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ విద్యార్థుల కోసం అదనపు సమయం కేటాయించడం, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా బోధించడం, సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొనేలా ప్రోత్సహించడం, నవోదయ ప్రవేశాలకు సిద్ధం చేయడం, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడం వంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వారు అంటున్నారు.

ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాల పేరు రాష్ట్రస్థాయిలో మరింత మారుమోగేలా రంజిత చేస్తున్న కృషికి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేస్తూ.. ఆమెకు పాఠశాల తరఫున మరింత సహకారం అందిస్తామని పేర్కొంటున్నారు.

**ఉపాధ్యాయురాలిగా మాత్రమే కాదు.. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శిగా పాఠశాల ఉపాధ్యాయురాలు**

రంజిత చేస్తున్న కృషి చూస్తే ఆమెను కేవలం పాఠాలు చెప్పే ఉపాధ్యాయురాలిగా కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శిగా తల్లిదండ్రులు అభివర్ణిస్తున్నారు. 20 నెలల స్వల్ప కాలంలోనే ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను రాష్ట్రస్థాయి వేదికపై నిలబెట్టడం, సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ స్థానం సాధించేలా చేయడం, నవోదయ లక్ష్యంగా విద్యార్థులను సిద్ధం చేయడం ఆమె అంకితభావానికి నిదర్శనమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఇలాంటి ఉపాధ్యాయుల కృషికి పాఠశాల, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అండగా నిలిస్తే ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాల భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి రాష్ట్రస్థాయిలో ఆదర్శ పాఠశాలగా నిలిచే అవకాశం ఉందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇస్రోజీవాడి గ్రామ పాఠశాలకు 7వ తరగతి వరకు చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లి దండ్రులు వేడుకుంటున్నారు

# కవిత హరీష్ ను ఎందుకు టార్గెట్ అయ్యారు



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన అనే సరికొత్త వేదికను ఏర్పాటు చేసినప్పటి నుంచి కల్వకుంట్ల కవిత తన ప్రధాన రాజకీయ అస్త్రాన్ని హరీష్ రావు వైపే గురిపెట్టారు. సాధారణంగా ప్రతిపక్షాలు , పొలిటికల్ శత్రువులపై చేసే విమర్శలకు భిన్నంగా.. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడానికి హరీష్ రావే కారణమని, ఆయన క్షుద్రపూజలు చేయిస్తున్నారంటూ ఆమె చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ సరిహద్దులను దాటేశాయి. చాలా కాలం కలసి పని చేసిన, పైగా సమీప బంధువు అయిన మాజీ మంత్రిపై కవిత ఇంతటి తీవ్రమైన పొలిటికల్ ఎటాక్‌కు దిగడం వెనుక ఒక సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందని భావిస్తున్నారు. కవిత ప్రధాన లక్ష్యం?బీఆర్ఎస్ గులాబీ శ్రేణుల్లోను, కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్ రావుపై కోలుకోలేని స్థాయిలో అపనమ్మకాన్ని పెంచడమే. కవిత అరెస్టు కావడం, ఆ తర్వాత పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడం, చివరికి కేసీఆర్ ఆమెను పక్కన పెట్టేలా జరిగిన పరిణామాల వెనుక హరీష్ రావే సూత్రధారి అనే బలమైన నమ్మకం ఆమెలో ఉంది. అందుకే హరీష్‌ను పార్టీలో ఒంటరిని చేసి, ఆయన బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేలా వాతావరణం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. కవిత వ్యూహం కేవలం వ్యక్తిగత కోపం కాదు. బీఆర్ఎస్ క్యాడర్ , కేసీఆర్ ఆత్మీయుల దృష్టిలో హరీష్‌ను విశ్వాసఘాతకుడిగా ముద్ర వేయడం ద్వారా, పార్టీపై హరీష్ పట్టును సడలించాలనేది ఆమె వేసిన పక్కా ప్లాన్ అనుకోవచ్చు. టీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో, క్యాడర్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నేత హరీష్ రావు. ఒకవేళ హరీష్ పార్టీ నుంచి నిష్క్రమిస్తే.. పార్టీపై, గులాబీ కేడర్‌పై కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం తిరుగులేనిదిగా మారుతుంది. అయితే ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి కవిత దూరమయ్యారు. కేటీఆర్ దే ఆధిపత్యం అవుతుంది. అయితే కేటీఆర్ వద్ద అసలు నాయకత్వ లక్షణాల్లేవని కవిత అంటున్నారు. హరీష్ రావు గనక బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే, గులాబీ పార్టీ బలహీనపడుతుంది. అప్పుడు బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలకు, కేడర్‌కు కవిత పార్టీ ఒక ప్రధాన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కు ఇప్పటికీ అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా హరీష్ ఉండటాన్ని కవిత తట్టుకోలేకపోతున్నారు. హరీష్‌ను పార్టీకి దూరం చేయగలిగితే, మళ్లీ కేసీఆర్ మనసు గెలుచుకుని, అవసరమైతే భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను తన వేదికతో విలీనం చేసి రీ-ఎంట్రీ ఇవ్వవచ్చనే ఆలోచన కూడా ఆమెలో ఉండి ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే కవిత వేస్తున్న ఈ పావులు ఎంతవరకు పారుతాయనేది సందేహాస్పదమే. హరీష్ రావు దశాబ్దాలుగా గ్రౌండ్ లెవెల్ రాజకీయాలు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో నిర్మించిన నాయకుడు. కవిత చేసే క్షుద్రపూజల ఆరోపణలను సామాన్య ప్రజలు లేదా తీవ్రస్థాయి గులాబీ కేడర్ ఎంతవరకు నమ్ముతారనేది ప్రశ్నార్థకం. పైగా కేటీఆర్ కూడా ప్రస్తుతానికి హరీష్‌తో కలిసే ప్రతిపక్ష పోరాటం చేస్తున్నారు. ఒకవేళ కవిత అనుకున్నట్లుగా హరీష్ రావుపై ఈ ఆరోపణలు పనిచేసి, ఆయన బీఆర్ఎస్‌కు దూరమైతే అది కవిత తెలంగాణ రక్షణ సేన కు రాజకీయంగా ఊపిరి పోస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇది ఉమ్మడి మెదక్, వరంగల్ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసి, కాంగ్రెస్ లేదా బీజేపీలకు మేలు చేసే ప్రమాదం కూడా ఉంది. ఏది ఏమైనా కవిత-హరీష్ మధ్య జరుగుతున్న ఈ సమరం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరిన్ని ఊహించని మలుపులకు దారితీయనుంది.

## నేడు వినాయక ఉత్సవాలకు సన్నహాక సమావేశం

--ఎస్సై పుష్ప రాజ్




**సదాశివనగర్, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి)** వినయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్నాక సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎస్సై పుష్పరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ ఈ సమావేశం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నేడు అనగా సోమవారం కళాభారతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుంది కావున వినాయక నవరాత్రుల ఉత్సవాల కమిటీ సభ్యులు హాజరుకావాలని అన్నారు.

## మత్తమాలలో ఘనంగా ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ





**ఎల్లారెడ్డి, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విగ్రహ దాత, జపాన్ శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పైడి ఎల్లారెడ్డిని గ్రామస్తులతో కలిసి విగ్రహ ఆవిష్కరణ చేశారు. అంతకు ముందు పైడి ఎల్లారెడ్డిని గ్రామస్తులు బైక్ ర్యాలీగా గ్రామం వరకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆశయాలు, ఆదర్శాలను యువత స్ఫూర్తిగా తీసుకొని ధర్మ పరిరక్షణకు కంకణబద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ శివాజీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. శివాజీ మహరాజ్ పరిపాలనా దక్షత, ప్రజా సంక్షేమం కోసం అందించిన సుపరిపాలన గురించి పలువురు వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, ఆధ్యాత్మిక వేత్త అనూసూజ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు పెద్దేడ్ల నర్సింలు, పట్టణ అధ్యక్షులు రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని దేవేందర్, గ్రామ పెద్దలు జెలందర్ రెడ్డి, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు వినాయక ఉత్సవాలపై సన్నాహక సమావేశం

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణకు పోలీసుల సూచనలు**

**కామారెడ్డి మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులు హాజరుకావాలి**

**దేవునిపల్లి ఎస్సై రంజిత్**

**కామారెడ్డి టౌన్, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి)** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు దేవునిపల్లి ఎస్సై రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు, పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలపై ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నేడు అనగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. కామారెడ్డి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే కమిటీ సభ్యులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, చివరగా నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎస్సై తెలిపారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, మండపాల వద్ద పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై సమావేశంలో పోలీస్ అధికారులు కమిటీ సభ్యులకు సూచనలు చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా వినాయక మండపాల నిర్వహణలో నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని, ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు తమ గ్రామాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేసి పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై రంజిత్ కోరారు. కామారెడ్డి మండల పరిధిలోని గ్రామాల ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సన్నాహక సమావేశాన్ని సద్వినియోగం చేసుకుని సమావేశానికి హాజరై ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన సూచనలు, సలహాలను తెలుసుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరిస్తూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని దేవునిపల్లి ఎస్సై రంజిత్ విజ్ఞప్తి చేశారు.

## సంపాదకీయం

# శక్తిని సృష్టించాం.. నియంత్రించగలమా?

అమెరికాలోని న్యూ మెక్సికో ఎడారిలో 1945 జూలై 16. 'ట్రినిటీ' పేరిట తొలి అణు పరీక్ష జరిగింది. ప్రకృతిలో దాగి ఉన్న అపారమైన శక్తిని మనిషి అర్థం చేసుకోవడమే కాకుండా దాన్ని తన చేతుల్లోకి తీసుకోగలడని నిరూపితమైన క్షణమది. అణుశక్తి మానవ నాగరికత అభివృద్ధికి కొత్త అవకాశాలను తెరిచింది. అదే సమయంలో ప్రమాదకరమైన అణ్వాయుధ పోటీకి నాంది పలికింది. 1945 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వేలాది అణు పరీక్షలు జరిగాయి. వాటి ప్రభావం పరీక్షా కేంద్రాలకే పరిమితం కాలేదు. రేడియేషన్, పర్యావరణ కాలుష్యం, మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలు... మనిషి సృష్టించిన మహాశక్తి మరో ముఖాన్ని చూపించాయి. 1991 ఆగస్టు 29న కజకిస్థాన్‌లోని సెమిపలాటిన్స్క్ అణు పరీక్షా కేంద్రాన్ని మూసివేశారు. 1949 నుంచి 1989 మధ్య అక్కడ 456 అణు పరీక్షలు జరిగాయి. వాటి ప్రభావంతో స్థానిక ప్రజలు, భూభాగం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ కేంద్రం మూసివేతను పురస్కరించుకుని 2009లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 29ని 'అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం'గా ప్రకటించింది. ఇది కేవలం గతాన్ని గుర్తుచేసుకునే రోజు కాదు. అణుశక్తి మానవత, దానవతను గుర్తుచేసుకోవడంతో పాటు.. అణు పరీక్షలు నిలిపివేసి, అణ్వాయుధ రహిత ప్రపంచం దిశగా అడుగులు వేయాల్సిన ఆవశ్యకతను గుర్తుచేసే రోజు. ఎందుకంటే శక్తిని సృష్టించడం ఒక విజయమైతే.. దాన్ని నియంత్రించగలగడం అంతకుమించిన విజయం. ప్రతి గొప్ప వైజ్ఞానిక ఆవిష్కరణ మనిషి సామర్థ్యాన్ని పెంచింది. అగ్నిని అదుపులోకి తెచ్చాం. చక్రాన్ని కనిపెట్టాం. ఆవిరి శక్తిని ఉపయోగించుకున్నాం. విద్యుత్తును వినియోగించుకున్నాం. అణుశక్తిని విప్పాం. ఇప్పుడు కృత్రిమ మేధస్సును సృష్టిస్తున్నాం. సాంకేతిక శక్తి పెరిగే కొద్దీ దాని ప్రభావం కూడా పెరుగుతోంది. వేల కిలోమీటర్ల దూరం నుంచే లక్ష్యాలను ఛేదించగలిగే క్షిపణులు, డ్రోన్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. సైబర్ దాడులు భౌతిక సరిహద్దులను దాటి కీలక వ్యవస్థలను ప్రభావితం చేయగలవు. మరి అంతటి మహాశక్తి మన చేతుల్లో ఉన్నప్పుడు నిర్ణయం తీసుకునే మనిషి ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నాడన్నదే అసలు ప్రశ్న. మరింత స్పష్టంగా చూస్తే సాంకేతికంగా ఎదిగిన ప్రతి నాగరికత.. చివరకు తానే సృష్టించిన శక్తితో ప్రమాదంలో పడుతుందా? మనిషి ఆవిష్కరణ వేగం పెరుగుతున్న కొద్దీ దానికి తగిన చట్టాలు, నైతిక ప్రమాణాలు, భద్రతా వ్యవస్థలు, అంతర్జాతీయ నియమాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాలి. లేకపోతే సాంకేతికత మనిషి చేతిలో సాధనంగా కాకుండా.. మనిషి నియంత్రించాల్సిన శక్తిగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటిదాకా మనం నాగరికత అభివృద్ధిని ప్రధానంగా శక్తితో కొలిచాం. ఇక మరో ప్రమాణాన్ని కూడా చేర్చాల్సిన సమయం వచ్చింది. మన చేతుల్లోకి వచ్చిన శక్తిని ఎంత బాధ్యతగా నియంత్రించగలుగుతున్నాం? బహుశా అదే నిజమైన నాగరికతకు కొలమానం కావచ్చు. సెమిపలాటిన్స్క్ పరీక్షా కేంద్రం మూసివేయడం, అణు పరీక్షలపై అంతర్జాతీయ వ్యతిరేకత పెరగడం, సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందం (సీటీబీటీ) వంటి ప్రయత్నాలు.. మనిషి తాను సృష్టించిన ప్రమాదానికి పరిమితులు విధించేందుకు ప్రయత్నించాడని చూపిస్తున్నాయి. సీటీబీటీ ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోయినా అణు పరీక్షలపై అంతర్జాతీయ ప్రమాణాన్ని బలోపేతం చేయడంలో అది కీలక పాత్ర పోషించింది. శక్తిని సృష్టించిన నాగరికత దానికి పరిమితులు విధించగలదనే నమ్మకం. అదే మన ఆశ. ఆగస్టు 29 కేవలం అణు పరీక్షల చరిత్రను గుర్తుచేసే రోజు కాదు. మనిషి ప్రకృతిలోని అపారమైన శక్తిని తన చేతుల్లోకి తీసుకున్న క్షణం నుంచీ ప్రతి కొత్త సాంకేతిక విప్లవం ఒకే ప్రశ్నను మరింత తీవ్రంగా మన ముందుకు తెస్తోంది: మనం సృష్టించిన శక్తి మన భవిష్యత్తును నిర్ణయిస్తుందా లేక ఆ శక్తి భవిష్యత్తును మనమే నిర్ణయించగలమా? పశ్చిమాసియాలో ఇటీవలి సంఘర్షణల చరిత్ర ఒక పాఠం చెబుతోంది. సాంకేతికంగా అనుసంధానమైన ప్రపంచంలో ఒక ప్రాంతీయ సంక్షోభం కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలదనేదే ఆ పాఠం. అణుయుగం మరో పాఠం చెబుతోంది.. శక్తి పెరిగిన కొద్దీ మానవ తప్పిదానికి చెల్లించే మూల్యం కూడా పెరుగుతుంది. అధునాతన కృత్రిమ మేధస్సు మానవాళి భవిష్యత్తు గురించి హెచ్చరిస్తోంది -- మనిషి సృష్టించే శక్తి మరింత వేగంగా పెరగవచ్చు. అందుకే రాబోయే తరాలకు మనం ఇవ్వాల్సిన గొప్ప సాంకేతిక వారసత్వం మరింత శక్తిమంతమైన యంత్రాలు మాత్రమే కాదు. శక్తిని నియంత్రించే తెలివి, బాధ్యత, నైతికత. ప్రతి అభివృద్ధి చెందిన నాగరికత ఎదుర్కొనే ఒక పరీక్ష కావచ్చు. ఆ పరీక్షలో అసలు ప్రశ్న 'మనిషి ఎంత శక్తివంతుడయ్యాడు?' కాదు. 'తన చేతుల్లోకి వచ్చిన శక్తిని తానే ఎంత బాధ్యతగా నియంత్రించగలిగాడు?' ఆ ప్రశ్నకు మనం ఇచ్చే సమాధానమే.. మానవ నాగరికతకు తదుపరి అధ్యాయం ఉంటుందా.. లేక విశ్వంలోని మరో నిశ్శబ్ద నాగరికతగా మిగిలిపోతుందా అన్నదాన్ని నిర్ణయించవచ్చు.

# చక్కెర చిక్కులు



చక్కెర ధర పెరిగితే ఏం చేయాలి? మధ్యప్రదేశ్ మంత్రి కైలాశ్ విజయ్‌వర్గియా ఓ మంచి సలహా ఇచ్చారు. చక్కెర ధర ఎంత పెరిగితే జనానికి అంతమేలట. నలభైయేళ్ళు దాటినవారంతా పంచదారకు బహుదూరంగా ఉంటే ఆరోగ్యానికి మంచిదనీ, దేశంలో తొంభైశాతం జనానికి ఎలాగూ స్వీట్లు గిట్టవనీ, తానూ స్వీటు తిననని, అందువల్ల ధర బాగా పెరిగిపోతే మనకే మంచిదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలమీద సోషల్ మీడియాలో జనం విరుచుకుపడుతున్నారు. రాఖీ పౌర్ణమినాడు చెల్లెలు ప్రేమతో అన్ననోటిని తీపిచేస్తుందని, ఆ స్వీటు ఆహారపదార్థం కాదని, వారిమధ్య అనుబంధానికీ అనురాగానికీ నిదర్శనమని గుర్తుచేశారు కొందరు. పండుగల్లోనూ తీపి దండుగంటున్న ఈ నాయకులు చివరకు మన నిత్యజీవితంలో కూడా తీపి లేకుండా చేస్తున్నారని కోపగించుకున్నారు మరికొందరు. ఇదే అదనుగా బీజేపీ నాయకులు ఇటీవలికాలంలో ఇచ్చిన సలహాలు సైతం సోషల్ మీడియా తెరమీదకు మళ్ళీ వచ్చాయి. పెట్రోల్ ధరలు నియంత్రించలేనప్పుడు బయట తిరగవద్దన్నారు, పడిపోతున్న రూపాయి విలువను ఆపలేక విదేశాలకు పోవద్దనీ, బంగారం కొనద్దనీ హితవులు చెప్పారు, ఇప్పుడు ఏకంగా తీపితినడమే మానేయమంటున్నారు అని వారంతా ఆగ్రహిస్తున్నారు. ఇలా ధర పెరిగిన ప్రతీదానినీ వదిలేసుకోమంటూ ప్రజలకు చెప్పడం నాయకులకు ఉండాల్సిన లక్షణమేనా? అన్నది మంచిప్రశ్న. సదరు మంత్రిగారు ఆ వ్యాఖ్యను అనాలోచితంగానే చేసివుండవచ్చును కానీ, హెచ్చిన చక్కెర ధర కేంద్రప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టినమాట నిజం. దీనికితోడు, ఇథనాల్ తయారీ కోసం అధికమొత్తం చెరుకుని మళ్ళించడంతోనే సామాన్యుడికి ఈ కష్టం ముంచుకొచ్చిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. అందులో నిజం లేదని ప్రభుత్వం గట్టిగా చెబుతున్నప్పటికీ, ఈ20 పెట్రోల్ విషయంలో కేంద్రం పట్టుదల తెలిసిందే కనుక జనానికి విపక్షాలమాటే చెవికెక్కుతోంది. శ్రావణమాసంలో అన్ని నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పాటుగా, పంచదార మరీ ఖరీదు కావడం సామాన్యుడికి సహజంగానే కోపం తెప్పిస్తుంది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో గత నెలన్నరలోనే చక్కెర ధర నలభైశాతం పెరిగింది. ఈ పరిస్థితికి దారితీసిన అనేక కారణాల్లో తగినంత ఉత్పత్తి లేకపోవడం ఒకటి. ఎల్‌నినో ప్రభావం వల్ల, కొన్ని ప్రాంతాల్లో అధిక చీడ కారణంగా చెరుకు ఉత్పత్తి తగ్గింది. దీనికి తోడు ప్రభుత్వం భారీగా ఎగుమతులకు అనుమతించడంతో లక్షలాది టన్నుల పంచదార విదేశాలకు తరలిపోయింది. చెరుకు దిగుబడినుంచి పంచదార పంపిణీ వరకూ ప్రతీ దశా ప్రభుత్వం నియంత్రణలోనే ఉన్నప్పుడు తప్పు ఎక్కడ జరిగిందో తెలియదు. మార్కెట్‌లోకి విడుదల చేయాల్సిందీ, గిడ్డంగుల్లో ఉండాల్సిందీ, వ్యాపారుల నిల్వచేసుకోగలిగేదీ, విదేశాలకు అమ్మాల్సిందీ అంతా ప్రభుత్వమే నిర్ణయిస్తున్నప్పుడు అంచనాలు ఎందుకు తప్పాయి, సర్కారును తప్పుదోవపట్టించిన మార్కెట్ శక్తులేమిటన్నవి ప్రశ్న. పాలకుల ఇథనాల్ మోజు ఈ స్థితికి పూర్తికారణం కాకపోవచ్చు. కానీ, లోటును గుర్తించేసరికే కొన్ని మిలియన్ టన్నుల చెరుకు బయోఫ్యూయల్ కోసం తరలిపోయిందన్నది విశ్లేషకుల వాదన. ఎల్‌నినో, ఇథనాల్ కంటే ప్రస్తుత సంక్షోభానికి మార్కెట్ శక్తుల మాయే ప్రధానకారణమని కూడా అంటున్నారు. చక్కెర పరిశ్రమను నియంత్రించే నాయకులు, హోల్‌సేల్ వ్యాపారులు, స్టాకిస్టులు పండుగల కాలం సమీపిస్తున్న తరుణంలో అధిక లాభాలకోసం ఈ సంక్షోభాన్ని సృష్టించి ఉండవచ్చు. తీపి కోసం తహతహలాడే ఈ కాలంలో మిఠాయీ తయారీదారులనుంచి ఇళ్ళవరకూ పంచదార డిమాండ్ సహజంగానే ఎక్కువగా ఉంటుంది కనుక, డిమాండ్--సప్లై మధ్య అగాధం ఎంత పెరిగితే అంత లాభం చేకూరుతుంది. ఉత్పత్తి, నిల్వలు, కోటాలు, ఇథనాల్ కేటాయింపులు ఇత్యాది సమస్త విషయాల్లోనూ ప్రభుత్వం తన ట్రాకింగ్ విధానాలను, వ్యవస్థలను చక్కదిద్దుకోవాల్సి ఉందని ప్రస్తుత సంక్షోభం గుర్తుచేస్తోంది. ఆలస్యంగా మేల్కొన్నప్పటికీ, ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని నివారించేందుకు పలు చర్యలు చేపట్టడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దిగుమతి సుంకాలు రద్దుచేసి అక్టోబర్ 31వరకూ భారీ ఎత్తున ముడిచక్కెరను దిగుమతి చేసుకొనేందుకు ప్రభుత్వం అనుమతించడంతో పరిస్థితిలో మార్పు వస్తోంది. దసరా, దీపావళి నాటికి చక్కెర ధర పూర్తిగా దిగివచ్చి సామాన్యుడు నోరు తీపిచేసుకోగలుగుతాడని ఆశిద్దాం.

# 'తెలుగు తక్కువ' తరానికి దారేది?



ఏడాదికి రెండుసార్లు.. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ఆర్నెల్లకోసారి మనకు తెలుగు భాష గుర్తొస్తుంది. ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం, ఇంకో ఆర్నెల్లకు ఆగస్టు 29న తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా భాష గురించి మాట్లాడుకుంటాం. తెలంగాణ ఏర్పడిన తరువాత సెప్టెంబర్ 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా పాటిస్తున్నారు. ఏమైనా, భాష గురించి ఈ రోజుల్లో చర్చించుకోవటానికైనా ఈ 'దినోత్సవాలు' పనికొస్తున్నాయి. తెలుగు భాషకు ఇంగ్లీష్ వల్ల పెనుప్రమాదం వచ్చిందని ఈ సందర్భంగా ఉపన్యాసాలు ఇవ్వటం, అందులో మీడియా భాష మీద నాలుగు రాళ్ళేసి వెళ్ళటం క్రమం తప్పకుండా జరుగుతోంది. వాడుక భాషలో ఇంగ్లీష్ మాటలు ఎక్కువగా వస్తున్నాయనే విమర్శ ఉన్నమాట నిజం. ఇంగ్లీష్ మీడియం చదువులు ఒకవైపు, మీడియాలో అనవసరపు ఇంగ్లీష్ మాటల వాడకం ఇంకోవైపు ఈ పరిస్థితిని మరింత దిగజారుస్తూ వస్తున్నాయి. అయితే, సంస్కృతం వాడకం సంగతేంటి? 'జనని సంస్కృతంబు ఎల్ల భాషలకు' అనే మాట నిజమే అయినా, ఇంకా ఎంత కాలం అదే సంస్కృతంతో తెలుగుకి దూరమవుదాం? 'వాడుక భాష' అనకుండా 'వ్యావహారిక భాష' అనటంలోనే మనకున్న సంస్కృత ప్రేమ అర్థమవుతోంది. ఏదైనా ఒక ఇంగ్లీష్ మాట వస్తే దాన్ని తెలుగులో చెప్పాలనుకున్నప్పుడు మనం సంస్కృతాన్ని ఆశ్రయిస్తున్నాం. మీడియాలో ఇప్పటికీ అదే జరుగుతోంది. మొబైల్ ఫోన్‌ను చరవాణి అని, ఇంటర్నెట్‌ను అంతర్జాలం అని రాస్తున్నాయి. కేవలం ఇంగ్లీష్ వాడకూడదనే అభిప్రాయంతోనే ఇలాంటి అనువాదాలకు దిగుతున్నట్టు ఉంది తప్ప సామాన్యులకు అర్థం కావాలన్న అభిప్రాయం ఉన్నట్టు కనబడడం లేదు. పైగా, ఎక్కువమంది మెచ్చి ఆహ్వానించి వాడటం మొదలుపెట్టినప్పుడే ఇలాంటి మాటలకు సార్వజనీనత వస్తుంది. ఔటర్ రింగ్ రోడ్‌ను బాహ్య వలయ రహదారి అని అనువదించటం వల్ల ఒరిగేదేమీలేదు. ఇంకా వీలైతే 'చుట్టుదారి' లాంటి మాట అయితే జనం అర్థం చేసుకుంటారు. సామాన్య జనం 'ఇళ్ళు కడతారు'. మీడియా వాళ్ళు మాత్రం 'గృహాలు నిర్మిస్తారు'. జనం కొత్త బట్టలు వేసుకుంటారు. కానీ మీడియా రాతల్లో మాత్రం 'నూతన వస్త్రాలు ధరిస్తారు'. అసలు ఏ మాత్రమూ ఆలోచించకుండానే మీడియాలో చాలా సందర్భాలలో 'నూతన' అని వాడుతున్నారు తప్ప జనం మాటల్లో వాడే 'కొత్త' జోలికి పోవటం లేదు. 'అనంతరం' బాగుంటుంది గాని తరువాత నచ్చదెందుకో? జనం 'ఒప్పుకుంటారు' గాని మీడియా వాళ్ళు మాత్రం 'అంగీకరిస్తారు'. 'పుట్టారు' బదులు 'జన్మించారు' అంటారు. 'వాడకం' బదులు వినియోగం అంటేనే తృప్తిగా ఉంటోంది. 'కోప్పడ్డారు' బదులు 'ఆగ్రహించారు' అని వాడాల్సిన అవసరం ఏమొచ్చింది? గెలిచారు అనటానికి బదులు విజయం సాధించారు అని, అమ్మకం బదులు విక్రయం అని, ఓడినవాళ్లను పరాజితులు అని, 'మెచ్చుకున్నారు' బదులు 'అభినందించారు' అని, ఎగతాళి బదులు అపహాస్యం అని, పుకార్లు బదులు వదంతులు అని రాయటం, చెప్పటం నిజం కాదా? మనం రాసేటప్పుడు ఆ మాట సామాన్య జనం వాడుతున్నదా, కాదా అనేది ఒక్క క్షణమైనా ఆలోచిస్తున్నామా? తరచూ తెలుగుభాష గురించి ఆవేదన వెళ్లగక్కే ఒక ఆచార్యులవారు ఈ మధ్యనే తన అనుభవాన్ని పంచుకున్నారు. చాలా పెద్ద చికిత్సాలయానికి వెళ్ళి 'దంతవైద్యునితో కలిసేది ఉంది' అని అక్కడున్న మహిళతో అంటే ఆమె ఏగాదిగా చూసిందట. 'డెంటిస్ట్ అపాయింట్‌మెంట్ ఉంది' అన్నప్పుడు ఆమెకు అర్థమైందట. ఈ పరిస్థితికి తెలుగు వాళ్ళందరినీ సిగ్గుపడవలసిందిగా కోరతున్నారాయన. దంత వైద్యుడనే సంస్కృతం జోలికి పోకుండా, దుష్టసమాసమంటూ చాదస్తానికి పోకుండా 'పళ్ల డాక్టర్' అని అడిగి ఉంటే సరిపోయేది. జనం నోళ్లలో నానే 'బడి'ని 'పాఠశాల' చేసి అదే రుద్దాలని చూడటం వల్ల చివరికి 'స్కూలు' స్థిరపడిపోయింది. 'పై చదువులకు' అని జనం మాట్లాడుకుంటూ ఉంటే మీడియా మాత్రం 'ఉన్నత విద్యాభ్యాసం కోసం' నుంచి దిగిరాలేదు. ఈలోగా 'హయ్యర్ స్టడీస్' అని మాట్లాడే తరం వచ్చేసింది. అతిగా ఇంగ్లీష్ వాడవద్దని చెప్పాలి తప్ప చీటికి మాటికి సంస్కృతాన్ని ఆశ్రయించటం తగ్గించుకోమని ఎవరైనా చెప్పినా సంస్కృత ప్రేమికులకు కోపమొస్తుంది. వందల ఏళ్లనాటి పరాయిభాష కంటే వేల ఏళ్ల నాటి మన సంస్కృతం మెరుగు అనేది వీళ్ళ సమాధానం.

ఒకప్పటి గ్రాంథికం నుంచి ఇప్పుడున్న స్థాయికి రావటానికి అవిశ్రాంత పోరాటం జరిపి, వ్యావహారిక భాషోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళినవాడు గిడుగు రామమూర్తి. కొంతమంది పండితులు ఆయన వాదనతో ఏకీభవించి సరళ గ్రాంథికంలో రచనలు మొదలుపెట్టారు. ఆ తరువాత పత్రికలు కూడా అదే బాట పట్టాయి. తాపీ ధర్మారావు లాంటివాళ్లు చొరవతీసుకున్నారు. శిష్టవ్యావహారికంలో రాయటం మొదలుపెట్టారు. 'వారు పరమపదంబు జెందె' నుంచి 'వారు పరమపదించారు' దాకా తీసుకురాగలిగారు. ఆ తరువాత తరాల్లో మరింత సరళమై 'వారు చనిపోయారు' దాకా రావటం చూస్తున్నాం.

గిడుగు తరువాత కూడా వ్యావహారిక భాష మీద మరింత ఆలోచన జరిగింది. 1970లలో కూడా యూనివర్సిటీల పాఠ్యగ్రంథాలు గ్రాంథికంలోనే ఉండటం మీద చర్చ మొదలైంది. ప్రభుత్వ కార్యకలాపాలు, యూనివర్సిటీ పరీక్షలు, పరిశోధనాపత్రాలు శిష్టవ్యావహారికంలో అనుమతించాలంటూ 1971లో ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన తీర్మానం ఒక చరిత్రాత్మక ఘట్టం. దీనిమీద 11 మందితో ఏర్పాటైన కమిటీ ఐదు సమావేశాలు జరిపింది. ఆంధ్ర, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల పరిధిలోని ఎనిమిది మంది, ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని ఏడుగురు సాహిత్య, పాత్రికేయ ప్రముఖుల అభిప్రాయాలు సేకరించారు. ఆ విధంగా రూపొందించి ఇచ్చిన నివేదిక ఆధారంగా శిష్టవ్యావహారానికి ఆమోద ముద్ర పడి యాభై ఏళ్ళు గడిచాయి.

ఈ యాభై ఏళ్ళలో భాష వాడకంలో చాలా మార్పులొచ్చాయి. రచనల్లో, విద్యారంగంలో, మీడియాలో వచ్చిన మార్పులు చాలా ఉన్నాయి. అయితే, ఈ మార్పులు ఏ దిశగా వెళుతున్నాయన్నదే భాషా ప్రేమికుల ఆందోళన. తప్పులు ఎంచుకుంటూ బాధపడటం కంటే, ప్రవాహశీలమైన భాషను క్రమబద్ధం చేసి దిశానిర్దేశం చేయాలన్న ఆలోచన కూడా కొంతమంది మాటల్లో బైటపడుతోంది. ఇది వ్యక్తులతో వీలయ్యే పనికాదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు అకాడెమీలు, తెలుగు విశ్వవిద్యాలయాలు, అధికార భాషా సంఘాలు, మీడియా అకాడెమీలు ఉన్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఈ సంస్థల సారథ్యంలో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తెలుగు భాష వాడకం తీరుతెన్నులను సమీక్షించి ఇప్పటి 'తెలుగు తక్కువ' తరానికి మార్గదర్శనం చేసేలా సూచనలివ్వాలి.

కృత్రిమ మేధస్సు (ఏఐ), యంత్ర అనువాదం, వాయిస్ అసిస్టెంట్లు, పాడ్‌కాస్ట్‌లు, ఓటీటీ వేదికలు, సోషల్ మీడియా, డిజిటల్ వార్తా వ్యవస్థల విస్తరణతో తెలుగు భాష వాడకం ఇంతకుముందెన్నడూ లేనంతగా పెరిగింది. అందువల్ల భవిష్యత్తులో చాలా మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. తెలుగు వాయిస్ సెర్చ్ వినియోగం పెరుగుతుంది. ఎఐ ఆధారిత వార్తా రచన అభివృద్ధి చెందుతుంది. డిజిటల్ నిఘంటువులు మరింతగా అందుబాటులోకి వస్తాయి. యూనికోడ్ వినియోగం వల్ల తెలుగు లిపి మరింత విస్తరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు కంటెంట్ వాడకం పెరుగుతుంది. మీడియాలో తెలుగు సాంకేతిక పదసంపద అభివృద్ధి చెందుతుంది. వాడుక భాషను వేగంగా జనంలోకి తీసుకువెళ్లటంలో సోషల్ మీడియా పాత్ర చెప్పుకోదగినంతగా ఉంది. అయితే, భాషా ప్రమాణాల మీద ప్రతికూల ప్రభావం కూడా చూపుతోంది. అందుకే అవసరమైనంత మేరకే ఇంగ్లీష్, సంస్కృతం వాడేట్టు చూడటం ద్వారా తెలుగును కాపాడుకోవాలి. ఆధునిక తెలుగు వాడకం కోసం ఒక శైలీపత్రం తయారు చేయాలి.

విశ్వవిద్యాలయాల స్థాయిలో శిష్టవ్యావహారానికి ఆమోద ముద్రపడి యాభై ఏళ్ళు పూర్తయిన సందర్భంలోనైనా తెలుగుభాషా దినోత్సవం ఒక రోజుకే పరిమితం కాకూడదని, భాషను కాపాడుకోవటం గురించి పాలకులు సానుకూలంగా దృష్టిపెట్టాలని కోరుకుందాం.

# యువజన సంఘాలను అణిచివేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి.. రాజీనామాకు డిమాండ్

**గన్నేరువరం :** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి నుండి గన్నేరువరం మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పోత్తూరు వరకు డబుల్ నిర్మాణం పూర్తి చేయాలని యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి లేకపోయినా యువజన సంఘాలు అనుకున్న సమయానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజల మద్దతుతో నిరాహార దీక్ష చేపట్టిన స్థలానికి చేరుకోగా కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ వాహనాల్లోకి ఎక్కించారు. ఈ క్రమంలో పోలీసులకు, యువజన సంఘం నాయకులకు మధ్య పెనుగులాట జరిగింది. పలువురు యువజన సంఘాల నాయకులకు గాయాలయ్యాయి. అరెస్టు చేసి వారిని తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. యువజన సంఘాల నాయకులకు మద్దతు తెలపడానికి వచ్చిన ప్రజలు శాంతియుతంగా రోడ్డు కోసం నిరాహార దీక్ష చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం ఏంటని, రోడ్డు పరిస్థితి ఎలా ఉందో అధికారులకు తెలియదని మండల ప్రజలు పోలీసులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల అధ్యక్షుడు కాలువ నాగరాజు, మాజీ జెడ్పిటిసి మాడుగుల రవీందర్, రెడ్డి,అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన 100 రోజుల్లో డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారంలోకి వచ్చిన 1000 రోజులు పూర్తయినా కంకర రోడ్డు వైపు కన్నెత్తి ఎందుకు చూడడం లేదని ప్రశ్నించారు. అధికారం కోసం నాడు యువజన సంఘాలతో కలిసి ధర్నాలు చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేడు యువజన



సంఘాలను అణిచివేస్తున్నారని మండిపడ్డారు.

**డబుల్ రోడ్డు కోసం నినదించిన వారిపై అక్రమ కేసులు..**

ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఉద్యమాన్ని ఆపలేరని హితవు పలికారు. ఎమ్మెల్యే కవ్వంపల్లికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి యువజన సంఘాలతో కలిసి నిరాహార దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ రోడ్డు కోసం నినదించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. యువజన సంఘాలకు పోటీగా కాంగ్రెస్ నాయకులు ఓ ర్యాలీ అదే రోజు చేయడం ఏంటని ప్రశ్నించారు. నిరాహార దీక్ష చేపడతామని పోలీస్ శాఖను అనుమతులు అడుగుతే అధికార బలంతో అనుమతులు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. గన్నేరువరం మండలంలో జరుగుతున్న అరాచకాన్ని మండల ప్రజలు గమనిస్తున్నారన్నారు. రోడ్డు వేయడం చేతగాని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు..

## మరోవైపు పంట రక్షణ కోసం ఎలుగుబంటిగా మారిన రైతన్న

**జూలూరుపాడు :** అకాల వర్షాలు, తీవ్ర వర్షాభావం వంటి ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు.. పురుగు మందులు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా మార్కెట్‌లో పంటకు దక్కని గిట్టుబాటు ధర మరోవైపు.. వెరసి వ్యవసాయం అంటేనే నేడు నిత్య సంక్షోభంగా మారింది. అప్పులు తెచ్చి, రక్తాన్ని చెమటగా మార్చి సాగు చేస్తే చివరకు మిగిలేది కన్నీళ్లే. ఇలాంటి అనేక కష్టాల నడుమ, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా వచ్చిపడిన వానరాల బెడద రైతు వెన్ను విరుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన రైతు వేముల నాగయ్యతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు అనుభవిస్తున్న నరకయాతన ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది.

**ఆశల పత్తి చేలపై వానరాల దండయాత్ర..**

కాకర్ల గ్రామానికి ఆనుకుని ఉన్న తన పొలంలో నాగయ్య ఎన్నో ఆశలతో పత్తి సాగు చేపట్టాడు. ప్రస్తుతం పంట కాపు, పూత, పిందె దశకు చేరుకుంది. రైతుకు అత్యంత కీలకమైన ఈ సమయంలో ఊళ్లోని వేల సంఖ్యలో ఉన్న కోతులు నిత్యం దండులా చేనుపై విరుచుకుపడుతున్నాయి. పూతను తుంచేయడం, పిందెలను కొరికి పారేయడం, కాయలను రాల్చేయడంతో చేతికి అందాల్సిన పంట కళ్లముందే బుగ్గిపాలవుతోంది. మార్కెట్‌లో ఆశించిన ధర రాకపోయినా కనీసం పెట్టుబడైనా దక్కుతుందన్న ఆశను ఈ కోతుల మంద సర్వనాశనం చేస్తున్నాయి.

**కాపలాకే పరిమితమైన కుటుంబం.. రెక్కల కష్టం వృథా..**

కోతుల దాడి నుంచి పంటను కాపాడుకునేందుకు నాగయ్య కుటుంబం మొత్తం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో చేనులోనే కాపలాగా ఉండాల్సి వస్తోంది. దీంతో ఇతర కూలీ పనులకు వెళ్లే అవకాశం లేక, రోజువారీ జీవనం గడవడం కూడా భారంగా మారింది. ఎండనక, వాననక





గంటల తరబడి కేకలు వేస్తూ, రాళ్లు విసురుతూ కోతులను తోలినా ఫలితం శూన్యమైంది.

**ఆన్ లైన్ ఆలోచన..**

**ఒంటిపై ఎలుగుబంటి అవతారం..**

నిత్యం పడుతున్న ఈ మానసిక, శారీరక క్షోభకు ఎలాగైనా తెరదించాలని భావించిన నాగయ్య, ఆన్‌లైన్‌లో రూ.1,500 వెచ్చించి భయంకరమైన నల్లటి బొచ్చుతో కూడిన ఎలుగుబంటి కాస్ట్యూమ్ ను వికృతమైన మాస్క్‌ను తెప్పించుకున్నాడు.? కోతుల గుంపులు రాగానే నాగయ్య ఆ నల్లటి ఎలుగుబంటి డ్రెస్సును ధరించి, చేతులను పైకెత్తి అడవి మృగంలా అరుస్తూ చేల గట్ల వెంట దూసుకెళ్తున్నాడు. దీంతో నిజమైన ఎలుగుబంటే వచ్చి పడిందని భావిస్తున్న వానరమూకలు ప్రాణభయంతో వణికిపోతూ గ్రామ పొలిమేరలు దాటే వరకు పరుగులు తీస్తున్నాయి.

ఎలుగుబంటి వేషంలో కోతులను తరిమికొడుతున్న దృశ్యం పైకి వింతగా అనిపించినా, ఆ డ్రెస్సు లోపల నాగయ్య పడుతున్న వేదన వర్ణనాతీతం. మండుటెండలో, తీవ్రమైన ఉక్కపోత నడుమ బరువైన నల్లటి బొచ్చు డ్రెస్సు వేసుకుని చేను చుట్టూ పరిగెత్తడం ప్రాణసంకటంగా మారింది. ఒళ్లంతా చెమటతో తడిసి ముద్దవుతున్నా, ఊపిరాడని స్థితి ఎదురవుతున్నా పంటను దక్కించుకోవాలన్న ఆరాటంతోనే ఆ నరకయాతనను భరిస్తున్నాడు. ఒక వైపు తెగుళ్లు, మార్కెట్‌కు వెళ్తే పెట్టిన పెట్టుబడి కూడా రాని గిట్టుబాటు ధరల పరిస్థితి. వీటన్నింటికీ తోడు ఈ కోతుల బెడద మా బతుకులను ఆగమాగం చేస్తోంది. రైతుగా పుట్టి పొలంలో ఈ ఎండలో ఎలుగుబంటి వేషం వేసుకుని తిరగాల్సి రావడం ఎంత అవమానమో, ఎంత కష్టమో నాకే తెలుసు. కానీ ఏడాది కష్టాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఎలా ఊరుకోను ఇప్పటికైనా ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు స్పందించి కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి మమ్మల్ని ఆదుకోవాలని నాగయ్య అధికారులను వేడుకుంటున్నాడు.?

**గిట్టుబాటు ధర లేక, ప్రకృతి కరుణించక కునారిల్లుతున్న రైతు..**

తన పంటను రక్షించుకోవడానికి స్వయంగా 'మృగం'గా మారి పోరాడాల్సి రావడం మన వ్యవసాయ వ్యవస్థ దుస్థితికి నిదర్శనం. నాగయ్య పడుతున్న ఈ శ్రమకు, ఆయన కన్నీళ్లకు తెరపడాలంటే అధికార యంత్రాంగం వెంటనే స్పందించి గ్రామాల్లో వానరాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# యువతకు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ గొప్ప అవకాశం

**వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ నియామకాలకు సిద్ధమవుతున్న మహబూబాబాద్ జిల్లా యువతీ యువకులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పోలీస్ కానిస్టేబుల్ ు ఎస్ఐ కోచింగ్ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు మురళి నాయక్, చైర్‌పర్సన్ జ్యోతి, జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఐఏఎస్, ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ శిబిరం ఎంతో మంచి అవకాశమని అన్నారు. పోలీస్ ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన ఉచిత శిక్షణ అందించేందుకు ముందుగా 1,056 మంది అభ్యర్థులను స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపిక చేసి, అందులో 500 మంది అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎంపికైన 500 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ప్రత్యేక ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి వచ్చే అనుభవజ్ఞులైన



ఫ్యాకల్టీతో నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులకు శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ మరియు భోజన సదుపాయాలను కూడా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ జిల్లా కలెక్టర్, ఎస్పీ లను ఆదర్శంగా తీసుకొని యువత కష్టపడి ఉద్యోగాలు సాధించాలి: వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథి వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలోని యువతకు పోలీస్ ఉద్యోగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎంతో చక్కటి ఉచిత కోచింగ్ అందిస్తున్నారని అన్నారు. భద్రాద్రి జోన్ పరిధిలో కేటాయించిన పోలీస్ ఉద్యోగాల ఖాళీలను ప్రస్తావిస్తూ, మహబూబాబాద్ జిల్లాకు కేటాయించిన పోస్టులను లక్ష్యంగా చేసుకుని అభ్యర్థులు కష్టపడి సిద్ధం కావాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సంకల్పంతో ప్రారంభించిన ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమం అభ్యర్థులకు ఎంతో గొప్ప అవకాశమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు అండగా ఉంటుందని తెలిపారు.

అభ్యర్థులు నిరుత్సాహపడకుండా కష్టపడి, అవసరమైతే నిద్రలేని రాత్రులు గడుపుతూ లక్ష్యసాధన కోసం సిద్ధమై ఉద్యోగాలను సాధించాలని పిలుపునిచ్చారు. భాగ్యకిరణ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ పొంది తమలోని ప్రతిభను వెలికితీసి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ప్రతిభ ఉన్న అభ్యర్థులను గుర్తించి వారికి సరైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే మహబూబాబాద్ జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. యువతకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు, అవకాశాలు కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుద్యోగ యువత కోసం అనేక నోటిఫికేషన్లు జారీ చేసి ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత ప్రభుత్వానీ దన్నారు, భారీగా 562 గ్రూప్ వన్ ఉద్యోగాలు నోటిఫికేషన్లు జారీ చేసి పారదర్శకంగా నియామకాలు జరిపేమని తెలిపారు, అదేవిధంగా టీచర్స్ మెగా డీఎస్సీ, వైద్య ఆరోగ్యశాఖ తదితర విభాగాలలో ఉద్యోగాల భర్తీ చేయడం జరిగిందన్నారు,

## కాంగ్రెస్ విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసనలను విజయవంతం చేయాలి.. మాజీ మంత్రి పువ్వాడ పిలుపు



బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల తరఫున ప్రశ్నిస్తూ ఉద్యమిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పువ్వాడ వెల్లడించారు.కార్యనిర్వాహక ప్రభుత్వ సేవలను తెలుసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో, పరిపాలనలో పూర్తిగా విఫలమైందని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజలను చైతన్యపరిచేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

## వైభవంగా మార్వాడీల కావడి యాత్ర.. హరిహర మహాదేవ' నామస్మరణతో సాగిన భక్తుల పాదయాత్ర




**కారేపల్లి, ఆగస్టు 30:** మార్వాడీల కావడి యాత్ర ఆదివారం వైభవంగా సాగింది. ఖమ్మం పట్టణంలోని రామ్‌దేవ్ బాబా మందిరం వద్ద ఉదయాన్నే ప్రారంభమైన ఈ యాత్ర ఎన్టీఆర్ సర్కిల్, ఖానాపురం, బల్లేపల్లి, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు, పండితాపురం, ముచ్చర్ల, లింగాల, కారేపల్లి క్రాస్ రోడ్, సింగరేణి, అప్పాయిగూడెం, భాగ్యనగర్ తండా, ఆలియా తండాల మీదుగా ఇల్లెందు పట్టణంలోని రామ్‌దేవ్ బాబా ఆలయానికి చేరుకుంది. మార్వాడీ కుటుంబాలకు చెందిన వందలాది మంది భక్తులు కావడి యాత్రలో పాల్గొన్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో కుటుంబ బంధాలు బాగుండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు విస్తారంగా కురవాలని కోరుకుంటూ మార్వాడీలు కావడి యాత్ర చేపడతారు. భక్తులు కావడికి పవిత్ర జలాలను కట్టుకుని 'బోల్ బమ్', 'హరిహర మహాదేవ' నామస్మరణ చేస్తూ రామ్‌దేవ్ బాబా, శివాలయాలకు చేరుకున్నారు. యాత్రలో మహిళలు, చిన్నారులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాలినడకన ఇల్లెందులోని ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర జలంతో అభిషేకాలు, పూజలు నిర్వహించి కావడి యాత్రను ముగించారు.

## కారేపల్లి శివాలయ అభివృద్ధికి బెల్ డీజీఎం శ్రీకారం



**కారేపల్లి :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పురాతన శివాలయ అభివృద్ధికి ప్రముఖ బెల్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) గుగులోత్ రవి శ్రీకారం చుట్టారు. గర్భగుడికి ఆనుకుని ఉన్న మండపం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆలయ నిర్వహణ కమిటీ ఈ విషయాన్ని రవి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన.. మండప నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు 12 పిల్లర్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ ఎర్ర నరసింహారావు, కమిటీ సభ్యుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## తాగునీటి కోసం రోడ్డెక్కిన ఎస్సీ కాలనీ వాసులు.. సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



**దమ్మపేట రూరల్:** నెల రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని మొద్దులగూడెం ఎస్సీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. కాలనీలో తాగునీటి మోటార్ కాలిపోవడంతో దాన్ని బోరు నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నించగా బోరులోనే ఇరుక్కుపోయిందని గ్రామస్తులు తెలిపారు. కొత్త బోరు వేస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి చెప్పారని పేర్కొన్నారు. నెల రోజులుగా తాగునీటి కోసం సమీపంలోని పామాయిల్ తోటల్లోని డ్రిప్ పైపుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని సీపీఎం దమ్మపేట మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. వర్షాలు పడినప్పుడు మోటార్లను ఆపివేస్తున్నారని, మోటార్లు పనిచేయని సమయంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి 'ఇవాళ.. రేపు' అంటూ కాలం వెళ్లదీస్తున్నారని సీపీఎం జిల్లా నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ అన్నారు. తక్షణమే తాగునీటి సరఫరాను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## కూలర్‌ను పక్కకు జరుపుతుండగా కరెంట్ షాక్.. యువకుడు మృతి



**దస్తురాబాద్ :** విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన ఎంబాడి సతీష్ (27) ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న సతీష్ శనివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంట్లో ఉన్న ఇనుప ఎలక్ట్రిక్ కూలర్‌ను పక్కకు జరిపే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే దస్తురాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సూర్యాపేటలో ఘనంగా ఇంద్రవెల్లి ముత్యాలమ్మ బోనాలు.. అమ్మవారిని దర్శించుకున్న జగదీశ్ రెడ్డి



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. బోనాల పండుగను పురస్కరించుకొని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ముందస్తుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గౌడ పెద్దలు, పూజారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించిన అనంతరం శాలువాతో సత్కరించారు.

## ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు

నల్లగొండ జిల్లా చెర్వుగట్టు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లారీని ఢీకొన్న అనంతరం కారు సుమారు 200 మీటర్లు వెనక్కి వెళ్లినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన వారికి నర్కెట్‌పల్లి అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నీట్ పీజీ-2026 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ :** నర్సంపేటలోని బిట్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ--2026 పరీక్షను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ తనిఖి లో జిల్లా కలెక్టర్ వెంట డియార్వో విజయలక్ష్మి , నర్సంపేట ఆర్డీవో ఉమారాణి సెక్షన్ సూపరిడెంట్ రంజిత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ రోజు నిర్వహించిన నీట్ పీజీ--2026 పరీక్షకు మొత్తం 132 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 127 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## చింతల్‌లో శ్రీ భక్త హనుమాన్ దేవస్థానంలో ప్రతిష్ఠాపన మహోత్సవం



**వరంగల్ :** ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు వరంగల్ తూర్పు నియోజకవర్గం చింతల్‌లోని శ్రీ భక్త హనుమాన్ దేవస్థానంలో నవగ్రహ, ధ్వజస్తంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు మాట్లాడుతూ.. శ్రీ భక్త హనుమాన్ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ మహోత్సవంలో మండల శ్రీకాంత్, మర్రి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు వీర ప్రతాప్, సుగుణకర్ రావు, కేవీకే రాజు,చంద్రశేఖర్, మధు, సమ్ములు, శ్రీధర్, గోపి, సాగర్, అర్చకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం

**వరంగల్** బొల్లోనిపల్లి గ్రామాభివృద్ధికి సమగ్ర చర్యలు – సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా ప్రభుత్వం హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలో నిర్వహిస్తున్న “పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన” కార్యక్రమంలో భాగంగా బొల్లోనిపల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ప్రజల సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, గ్రామ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బొల్లోనిపల్లి ప్రగతి నివేదిక ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బొల్లోనిపల్లి గ్రామంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. గ్రామంలో 6 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టనున్నారు. 71 చేయూత పెన్షన్లకు రూ. 19.57 లక్షలు విడుదల చేస్తున్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో 119 కుటుంబాలకు రూ. 4.54 లక్షల మేర లబ్ధి చేకూరింది. మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ కింద 82 కుటుంబాలకు రూ. 66,048 విడుదల చేశారు. 13 స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ. 1.75 లక్షలు అందించారు. 33 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 3.98 కోట్ల రుణాలు అందించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి 300 కిట్ల చొప్పున 13 రకాల వస్తువులు అందించారు. 161 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. 18 మంది రైతులకు రూ. 17.05 లక్షల రైతు రుణమాఫీ నిధులు విడుదల చేశారు. 206 మంది రైతులకు రైతు భరోసా నిధులు అందించారు. రైతు భీమా కింద ఒక రైతు కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కు అందించారు. 5 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందించారు. 156 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయగా, మరో 270 మంది పేర్లను రేషన్ కార్డుల్లో నమోదు చేశారు. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కొనసాగుతోంది.

### రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధికి నిధులు

బొల్లోనిపల్లి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రోడ్డు నుంచి బొల్లోనిపల్లి వైపు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.60 కోట్లు మంజూరు చేశారు. గట్ల నర్సింగాపూర్ నుంచి బొల్లోనిపల్లి వరకు రూ. 1.70 కోట్లతో బీటీ రోడ్డు అభివృద్ధి చేశారు. రోడ్డు నుంచి బొల్లోనిపల్లి వరకు రూ. 41 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. మరో రోడ్డు అభివృద్ధికి రూ. 61.50 లక్షలు మంజూరు చేశారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలతో పనులు పూర్తి చేశారు.

మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కోసం రూ. 4.50



లక్షలతో పైప్‌లైన్ అభివృద్ధి చేశారు. గ్రామ సమస్యల పరిష్కారానికి హామీ గ్రామ సర్పంచ్ బొల్లి మానస ప్రశాంత్ గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో మరిన్ని సీసీ రోడ్లు, పాఠశాల భవనం, ఎర్రకుంట పునరుద్ధరణ, ముదిరాజ్, యాదవ సంఘ భవనాలు, గుట్టకింద తండాకు బీటీ రోడ్డు, బోర్‌వెల్, చేతిపంపు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. గ్రామ సర్పంచ్ లేవనెత్తిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థల సేకరణ పూర్తయితే గ్రామానికి వీఓ భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

### నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

జలసిరి పథకం కింద ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ. 6,500 అందిస్తుందని, పొలం కుంటకు రూ. 1.30 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించుకోవాలని మంత్రి సూచించారు.

### ప్లాస్టిక్‌కు దూరంగా.. స్టీల్ బ్యాంక్‌ల వినియోగం

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గ్రామాల్లో స్టీల్ బ్యాంక్‌లను వినియోగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వల్ల కలిగే ఆరోగ్య, పర్యావరణ సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

బొల్లోనిపల్లి గ్రామంలో మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు, ఒక్కో కిట్‌లో 13 రకాల వస్తువులను అందించామని తెలిపారు. హోటళ్లకు కూడా ఒక్కొక్కదానికి 100 స్టీల్ గ్లాసులు అందించినట్లు చెప్పారు.

### పెన్షన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్‌ఐవీ బాధితులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

14--15 సంవత్సరాల వయసున్న బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న టీకాలను వేయించాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు గ్రామాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని, బొల్లోనిపల్లి పాఠశాలకు పెయింటింగ్ వేయిస్తామని తెలిపారు.

### క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు

యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లి కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడల్లో పాల్గొనాలని మంత్రి సూచించారు.

నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించి, గ్రామాలకు క్రీడా సామగ్రిని అందిస్తున్నామని తెలిపారు. బొల్లోనిపల్లి గ్రామానికి క్రికెట్ కిట్, వాలీబాల్ తదితర క్రీడా సామగ్రితో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో క్రీడా సామగ్రి అందించినట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే మంచి గుర్తింపు రావడంతో పాటు సర్టిఫికెట్ల ఆధారంగా ఇండియన్ ఆర్మీ, పోలీస్ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.

ఇటీవల హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేశామని తెలిపారు.

### సౌర విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఇంటిపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్లకు రూ. 78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందన్నారు.

మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తోందని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రుణ పరిమితులను రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంచుతున్నామని మంత్రి తెలిపారు.

గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యనారాయణ రెడ్డి, ఉద్యానవన అధికారి కమలాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బొల్లి మానస ప్రశాంత్, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణకు ప్రజాభవన్‌లో ప్రత్యేక అధికారి కార్యాలయం ప్రారంభం

**వరంగల్ :** ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం సమన్వయ కేంద్రంగా పనిచేస్తుందని తెలిపిన మంత్రి గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు అనేలా వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణ వుండాలన్న మంత్రి సురేఖ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలు, సలహాల మేరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పనులను చేపడుతున్నట్లు స్పష్టంచేసిన మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు అనేలా దేశం నలుమూలలా తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే విధంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు వుండాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించేలా వసతుల కల్పన వుండాలని మంత్రి సురేఖ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది జూన్ 26 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లను సమర్థవంతంగా సమన్వయం చేసేందుకు ప్రజాభవన్ లోని రెండవ అంతస్తులో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆఫీసర్ (ప్రత్యేక అధికారి) కార్యాలయాన్ని ఈ రోజు మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. కార్యాలయంలోని సెక్షన్లను దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. తర్వాత ప్రత్యేకాధికారి కార్యాలయంలోని నూతన కాన్ఫరెన్స్ హాలులో మంత్రి సమీక్షా సమావశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, ఆర్జేసి రామకృష్ణారావు, డిసి కృష్ణ ప్రసాద్, పలువురు దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్ లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలు అనగానే ఇప్పటివరకు రాజమహేంద్రవరం పేరు ప్రధానంగా వినిపించేదని, వచ్చే గోదావరి పుష్కరాల నిర్వహణతో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుని, పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో మన రాష్ట్రానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల నిర్వహణలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని మంత్రి సురేఖ తెలిపారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని



అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఘాట్ల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక అధికారి కార్యాలయం కీలక సమన్వయ కేంద్రంగా పనిచేయడంతో పాటు, పుష్కరాల నిర్వహణకు సంబంధించిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడానికి వీలవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

వచ్చే సంవత్సరం 26 జూన్ నుంచి 7 జూలై వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతినిచ్చే సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్కర యాత్రగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నదని మంత్రి కొండా సురేఖ తెలిపారు. గోదావరి పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డిగారు రూ. 1000 కోట్ల నిధులను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను ఎంతో వైభవంగా నిర్వహించినట్లే, గోదావరి పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక సమ్మక్క-సారక్క జాతరను రెండుసార్లు విజయవంతంగా చేపట్టినట్లు గుర్తు చేశారు.

ఈ సందర్భంగా అధికారులు గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను మంత్రి కొండా సురేఖ గారికి వివరించారు. గోదావరి పరిహాక ప్రాంతంలో ఎంచుకున్న ప్రాంతాల్లో ఇప్పటికే ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు డైరక్టర్ హనుమంతరావు మంత్రి గారికి వివరించారు. టైర్--1, టైర్--2 పరిధిలో సుమారు 2 కి.మీ మేర ఘాట్‌ల నిర్మాణ పనులు ప్రారంభించగా, మొత్తంగా టైర్ 1, 2, 3 పరిధిలో 5 కి.మీకి పైగా ఘాట్‌లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. నిధుల వివరాల పై మంత్రి సురేఖ అధికారులను ఆరా తీయగా, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఆర్ అండ్ బి, పంచాయత్ రాజ్ శాఖలకు నిధులు విడుదలైనట్లు అధికారులు తెలిపారు. అలాగే మెడికల్, పోలీస్, టూరిజం శాఖలకు నిధులు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. దశలవారీగా టెండర్ల నిర్వహణ, నిధుల మంజూరీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఘాట్ల నమూనా చిత్రాలను అధికారులు మంత్రి సురేఖ గారు పరిశీలించారు.

గోదావరి నది పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా వున్నందున గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పాత ఘాట్లను పటిష్టం చేస్తూ, కొత్త ఘాట్లను మళ్ళీ వచ్చే పుష్కరాల వరకు మనగలిగేలా పటిష్టంగా నిర్మించాలని మంత్రి సురేఖ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.

### నేపాల్ భీకర వరదల్లోనూ కొట్టుకుపోకుండా స్థిరంగా నిలిచిన ఇంటిని ప్రస్తావించిన మంత్రి

ఇటీవల నేపాల్‌లో వచ్చిన భారీ వరదల్లో చుట్టుపక్కల ఎన్నో నిర్మాణాలు కొట్టుకుపోయినా, ఒక ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా నిలిచిన తీరును మంత్రి సురేఖ ఈ సందర్భంగా ప్రస్తావించారు. నాణ్యతకు గొప్ప ఉదాహరణగా ఆ ఇల్లు నిలుస్తుందన్నారు. గోదావరి పుష్కరాల పనులు విషయంలో హడావుడిగా కాకుండా నాణ్యతకు, పటిష్టతకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాల కోసం చేపట్టే ప్రతి నిర్మాణాన్ని రాజీ పడకుండా నాణ్యతతో చేపట్టాలని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. పుష్కరాల కోసం చేసే ఏర్పాట్లను తాత్కాలికమైనవిగా భావించకుండా, భవిష్యత్ కార్యక్రమాలను వుపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

“గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కర ఏర్పాట్లు కూడా భవిష్యత్ తరాలు సైతం కీర్తించేలా ఉండాలి. మన ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, దేవాలయాల ప్రాచీన వైభవానికి మరింత వన్నె తెచ్చేలా, నాణ్యతతో కూడిన శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి” అని మంత్రి సురేఖ సూచించారు. భక్తులు స్నానాలు చేసే ఘాట్లలో నీటి ప్రవాహ ఉధృతి ఎక్కువగా వుంటే కొట్టుకుపోయే పరిస్థితులున్నందున గ్రిల్స్ ను పటిష్టంగా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు అవసరమైన సౌకర్యాలను పకడ్బందీగా చేపట్టాలని ప్రత్యేకంగా నిర్దేశించారు. అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా, సమన్వయంతో వ్యవహరిస్తూ పుష్కరాల ప్రారంభానికి ముందే ఏర్పాట్లన్నీ పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని మంత్రి సురేఖ దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావుకు సూచించారు.

ఈ సందర్భంగా ప్రజా భవన్ కు వచ్చిన మంత్రి సురేఖ గారికి అర్చకులు, పండితులు వేదమంత్రోచ్చారణతో సాదరంగా స్వాగతం పలికారు.



## యష్ 'టాక్సిక్' సునామీ.. ట్రోలింగ్ ఎఫెక్ట్ ఉన్నా.. 4 రోజుల్లో రూ. 254 కోట్లు!

రాకింగ్ స్టార్ యష్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్-అప్స్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. సినిమాలోని హింసాత్మక సన్నివేశాలు, రొమాంటిక్ ట్రాక్స్ మరియు మహిళలను చూపించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోలింగ్ వస్తున్నప్పటికీ కలెక్షన్లపై మాత్రం ఎలాంటి ప్రభావం పడలేదు. విడుదలైన కేవలం 4 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 254.75 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి సంచలనం సృష్టిస్తోంది. తాజా నివేదిక ప్రకారం ఈ సినిమా నాల్గవ రోజు దేశవ్యాప్తంగా సుమారు రూ. 24.50 కోట్ల నెట్ కలెక్షన్లను సాధించింది. దీంతో భారత్‌లో నాలుగు రోజుల మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 190.45 కోట్లకు చేరగా, ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ. 227.50 కోట్లకు చేరుకున్నాయి. శుక్రవారంతో పోలిస్తే శనివారం దేశీయ వసూళ్లలో సుమారు 9.9 శాతం స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, వీకెండ్ కావడంతో వసూళ్లు పటిష్టంగానే సాగాయి. ఇక ఓవర్సీస్‌లో శనివారం రూ. 4 కోట్లు రాబట్టడంతో, విదేశీ గడ్డపై మొత్తం కలెక్షన్లు రూ. 27.25 కోట్లకు తాకాయి. కాగా, ఆగస్టు 26న కన్నడ, హిందీ, తమిళం, తెలుగు, మలయాళం మరియు ఇంగ్లీష్ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంలో హుమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా, నయనతార మరియు కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటించారు.

## బాలయ్య -- కొరటాల సినిమాలో కోలీవుడ్ స్టార్ హీరో.!

టాలీవుడ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం చర్చ జరుగుతున్న కాంబినేషన్ నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ కొరటాల శివ కలయిక. 'దేవర' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న కొరటాల శివ, తన తదుపరి ప్రాజెక్ట్‌ను నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో వినిపిస్తున్న కొన్ని వార్తలు అటు నందమూరి అభిమానుల్లో, ఇటు సినీ వర్గాలలో విపరీతమైన అంచనాలను పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ అవతార్‌లో దర్శకుడు చూపించబోతున్నట్లు తెలుస్తోంది. కేవలం యాక్షన్ కే పరిమితం కాకుండా, కథలో బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కొరటాల శివ పెద్దపీట వేస్తున్నారట. ఇప్పటివరకు ఆయన తెరకెక్కించిన సినిమాలన్నింటికీ ఒక బలమైన సామాజిక నేపథ్యం లేదా ప్రత్యేకమైన బ్యాక్‌డ్రాప్ ఉండటం విశేషం. ఇప్పుడు ఈ సినిమా కోసం కూడా అదే స్థాయిలో ఒక యూనిక్ బ్యాక్‌డ్రాప్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నెటిజన్లు మరియు సినీ విశ్లేషకులు ఈ సినిమా కథ ఏ నేపథ్యంతో సాగుతుందనే దానిపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు జరుపుతున్నారు. అంతేకాకుండా, ఈ సినిమాలో ఒక ప్రత్యేకమైన కీలక పాత్ర కోసం కోలీవుడ్ స్టార్ హీరో ఆర్యను సంప్రదించే పనిలో కొరటాల శివ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆర్య ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడని, ఆయన పాత్ర సినిమాకే ఒక మేజర్ హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. కథా చర్చలు పూర్తి కావడంతో త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. హ్యాట్రిక్ విజయాల జోరుమీదున్న బాలయ్య బాబుతో, మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కొరటాల శివ చేతులు కలపడంతో బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.





## ఓటీటీలోకి 'కొరియన్ కనకరాజు'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో సెప్టెంబర్ 4, 2026 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రాబోతుంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య కామెడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాను ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యువి క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. థియేటర్లలో అలరించిన ఈ మూవీ ఓటీటీలో ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన కనకరాజు (వరుణ్ తేజ్) చెక్కభజన ప్రదర్శనలు చేస్తూ సరదాగా గడిపేస్తుంటాడు. కియా ఫ్యాక్టరీలో పనిచేసే చైత్ర (రితికా నాయక్)ను ప్రేమిస్తాడు. ఇదే సమయంలో కొరియా నుంచి వచ్చిన ఓ గ్యాంగ్‌స్టర్ ఆత్మ కనకరాజు శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ ఆత్మ ఎవరిది? దాని లక్ష్యం ఏమిటి? దాని నుంచి బయటపడేందుకు కనకరాజు ఎందుకు కొరియా వెళ్లాల్సి వచ్చింది? అనేదే మిగతా కథ.

## మైత్రీ మూవీ మేకర్స్ తొలి హారర్ మూవీ '418'.. రిలీజ్ ఎప్పుడో తెలియక ఫ్యాన్స్‌లో పెరుగుతున్న ఆసక్తి!




మైత్రీ మూవీ మేకర్స్ ప్రస్తుతం వరుస విజయాలతో టాలీవుడ్‌లో జోరు మీద ఉంది. తాజాగా 'ఇరుముడి'తో భారీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను అందుకున్న ఈ నిర్మాణ సంస్థ.. మరోవైపు విభిన్న కథాంశాలతో తెరకెక్కుతున్న పలు క్రేజీ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. అయితే ఈ బ్యానర్ నుంచి రాబోతున్న తొలి హారర్ థ్రిల్లర్ '418' మాత్రం ఇంకా రిలీజ్ డేట్ కోసం ఎదురుచూస్తోంది. ఇప్పటికే సినిమా విడుదలకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. కొత్త విడుదల తేదీపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. '418' చిత్రానికి కీర్తన్ నాగగౌడ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ నీల్ ఈ ప్రాజెక్ట్‌కు బ్యాకింగ్ అందిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని 2026 జూలై 31న థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ మొదట నిర్ణయించారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు అనూహ్యంగా సినిమాను వాయిదా వేశారు. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చిత్ర బృందం అప్పట్లో వెల్లడించింది.అయితే జూలై చివరిలో రిలీజ్ వాయిదా పడినప్పటి నుంచి దాదాపు నెల రోజులు గడిచినా.. ఇప్పటివరకు కొత్త రిలీజ్ డేట్‌ను మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. దీంతో అసలు '418' సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే ప్రశ్న ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మైత్రీ మూవీ మేకర్స్ పేరు టాలీవుడ్‌లో భారీ కమర్షియల్ సినిమాలతో పాటు విభిన్న కథలను తెరకెక్కించే నిర్మాణ సంస్థగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో ఆ బ్యానర్ నుంచి వస్తున్న తొలి హారర్ థ్రిల్లర్ కావడంతో '418'పై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించిన కథ, పాత్రలు, కీలకమైన అంశాలను మేకర్స్ పెద్దగా బయటకు వెల్లడించలేదు. దీంతో సినిమా కాన్సెప్ట్ ఏంటి? ఇందులో ఎలాంటి హారర్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయి? అనే విషయాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ప్రశాంత్ నీల్ పేరు ఈ ప్రాజెక్ట్‌తో అనుసంధానం కావడం కూడా సినిమాపై అంచనాలు పెరగడానికి మరో కారణంగా మారింది. కీర్తన్ నాగగౌడ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించబోతోందనేది తెలియాలంటే మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967